


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 338, పేజీలు - 08
గురువారం, మే 1, 2025 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## 10 ఏళ్లు అధికారంలో మేము..
# ఫాంహౌస్‌లో మీరు



- కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఫైర్
- ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదన్న రేవంత్
- ఫాంహౌస్‌కే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు
- కాళేశ్వరం, రుణమాఫీ, ఉద్యోగాలపై చర్చకు రావాలని సవాల్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వరంగల్‌లో ఈ మధ్య కాలంలో నిర్వహించిన బీఆర్ఎస్ సభలో తన పేరు చెప్పే ధైర్యం కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేకపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. నిత్యం ఫామ్‌హౌస్‌లో ఉంటూ అసలు విషయాలు తెలుసుకోకుండా కడుపు నిండా విషం నింపుకొని మాట్లాడారని విమర్శించారు. ప్రజల్లో ఉంటే వారికి అందుకున్న సంక్షేమ ఫలాలు గురించి తెలుస్తుందని అభిప్రాయపడ్డారు. బసవేశ్వర జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. 12వ శతాబ్దంలోనే సమాజంలో అనేక మార్పులకు పునాదులు వేసిన విప్లవకారుడు బసవేశ్వరుడు అని అభివర్ణించారు. ఆయన జయంతి రోజున పదోతరగతి ఫలితాలు విడుదల చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు రేవంత్. బసవన్న స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కుల, మత, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది బసవన్న స్ఫూర్తితోనే పంచాయతీ రాజ్ పార్లమెంటరీ వ్యవస్థ తెచ్చుకున్నట్టు వెల్లడించారు. ప్రతీ మనిషి గౌరవంగా బతికేలా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు రేవంత్. అలాంటి ప్రభుత్వంలో ఉన్న లోపాలు ఎత్తి చూపేందుకు ప్రతిపక్షాలు ఉండాలన్నారు. కానీ ఇక్కడ మొన్న ఒకాయన వరంగల్‌లో సభ పెట్టి కాంగ్రెస్‌ను విమర్శించారన్నారు. “వాళ్లు రజతోత్సవాలు, విజయోత్సవాలు ఏర్పాటు చేసుకుంటే ఆర్టీసీ నుంచి బస్సులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించింది. వరంగల్ సభలో మేం చేసిన మంచిని అభినందించి ప్రజా సమస్యలను

2లో..

# జనాభా లెక్కల్లో కులగణన సర్వే
## - కేంద్రం బిగ్ న్యూస్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో చేయబోయే జనాభా లెక్కింపులో కుల గణనను కూడా చేర్చాలని ఢిల్లీలో బుధవారం రోజు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేంద్ర కమిటీలో నిర్ణయించారు. ఈ విషయాన్ని నేరుగా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. త్వరలోనే జనాభా లెక్కలు జరగబోతున్నాయని అందులోనే కులగణనను కూడా చేర్చబోతున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా కుల గణను పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించిందని అందులో ఏమాత్రం పారదర్శకత లేదని పేర్కొంది. బుధవారం కేంద్ర కాబినేట్‌లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన పూర్తి వివరాలను వివరించారు.

### జనాభా లెక్కల్లో కులగణన

బుధవారం రోజు ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన రాజకీయ వ్యవహారాల కేంద్ర కమిటీ భేటీ నిర్వహించింది. ఈ సమావేశం అనంతరం కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన వివరాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 2010లో నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ కుల గణన అంశాన్ని పరిశీలించాలని చెప్పారని గుర్తు చేశారు. ఈక్రమంలోనే నేటీ భేటీలో కుల గణనను జాతీయ జనాభా లెక్కల్లో చేర్చాలని నిర్ణయించినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడూ.. కుల గణనను వ్యతిరేకించాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. అలాగే చాలా రాజకీయ పార్టీలు కుల గణనను సిఫార్సు చేశాయన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు

2లో..

# టీజీపీఎస్సీపై హైకోర్టు ప్రశ్నల వర్షం

- గ్రూప్-1 పరీక్షల అవకతవకల ఆరోపణలపై హైకోర్టులో విచారణ
- వరుస నంబర్లకు ఒకే మార్కులు, మార్కుల ప్రకటనలో ఆలస్యంపై పిటిషనర్ల వాదనలు
- మూల్యాంకన విధానం, ముఖ్యంగా తెలుగు మాధ్యమంపై కోర్టు ప్రశ్నలు
- ఎవాల్యుయేటర్లకు ‘కీ’ పేపర్ ఇవ్వలేదని తెలిపిన టీజీపీఎస్సీ
- తెలుగు అభ్యర్థుల వివరాలు సమర్పించాలని ఆదేశం, విచారణ గురువారానికి వాయిదా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకన ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా న్యాయస్థానం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అనుసరించిన విధానాలపై పలు కీలక ప్రశ్నలు సంధించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ, వరుస క్రమంలో హాల్ టికెట్ నంబర్లు కలిగిన కొందరు అభ్యర్థులకు ఒకే విధమైన మార్కులు లభించాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, నిబంధనల ప్రకారం ప్రొవిజనల్ మార్కుల జాబితాను నిర్ణీత సమయంలో వెల్లడించలేదని,

2లో..

# సింహాచలం చందనోత్సవంలో విషాదం

- గోడ కూలి 7గురి భక్తుల దుర్మరణం
- సింహాచలం ఘటన దర్యాప్తుకు కమిటీ
- 72 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** విశాఖ సింహాచలం చందనోత్సవంలో అపశృతి చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి రూ.300 టికెట్ క్యూలైన్‌పై గోడ కూలి ఏడుగురు భక్తులు చనిపోయారు. కొందరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మినిస్టర్ లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం 25 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రమాదం చోటు చేసుకున్న సంఘటనాస్థలిని మంత్రులు, అధికారులు, వైసీపీ నేతలు పరిశీలించారు. ఈ ఘటనపై వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. కేవలం 10 రోజుల క్రితమే నిర్మించిన గోడ, అలా ఎలా కూలిపోయిందంటూ ప్రశ్నిస్తున్నారు. ఇక ఈ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 72 గంటల్లోగా ప్రమాదానికి సంబంధించి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. దర్యాప్తు చేయడం కోసం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో కమిటీ దర్యాప్తు చేయనుంది. దీనిలో రెవెన్యూ, ఇంజనీరింగ్ నిపుణులు ఉన్నారు. ప్రమాదానికి సంబంధించి అధికారులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. గోడ నిర్మాణంలో లోపాలు ఉన్నట్లుగా గుర్తించారు. బాధ్యులు ఎవరైనా సరే కఠిన చర్యలు ఉంటాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. గోడలను పరిశీలించి నాణ్యతా లోపాలు ఉన్నట్లుగా గుర్తించారు. గోడ నిర్మాణం చేసేటప్పుడే సరైన ప్రమాణాలు పాటించలేదని తెలుస్తోంది. గోడ కూలిపోయినప్పుడు ఇటుకలు వేర్వేరుగా పడిపోయి ఉన్నాయి. వాటి మధ్య సిమెంట్ లేనట్టుగా కనిపిస్తోంది. గోడ నిర్మాణం ధ్రుడంగా జరగలేదని సమాచారం. అందుకే వర్షానికి

2లో..

# సింహాచలం దుర్ఘటన బాధితులకు రూ.కోటి ఇవ్వాలి
## - లేకుంటే మేం ఆదుకుంటామన్న జగన్

- ప్రభుత్వ నిర్లక్ష్యం, నాణ్యతలేని నిర్మాణం వల్లే దుర్ఘటన అని ఆరోపణ
- బాధిత కుటుంబాలకు పరామర్శ
- రూ. 25 లక్షల పరిహారం సరిపోదని, పెంచాలని డిమాండ్
- గత ఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** సింహాచలంలో గోడ కూలిన ఘటన బాధితులను వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏడాదిలోనే ఇన్ని దారుణాలు చూస్తామని అనుకోలేదన్నారు. నాడు తిరుమలల వైకుంఠ ఏకాదశి నాడు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆరుగురి చావుకు కారణమయ్యారని ఇప్పుడు సింహాచలంలో కూడా అదే రిపీట్

2లో..

# తెలంగాణ చేసింది
## దేశం అనుసరిస్తుంది
### - కులగణనపై మోదీకి రేవంత్ థాంక్స్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జనాభా లెక్కలతోపాటు కుల గణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర కేబినెట్‌కు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర నిర్ణయంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విజన్ సాకారం కాబోతోందన్నారు. రాహుల్ గాంధీ విపక్షంలో ఉండి కూడా కేంద్ర విధానాన్ని ప్రభావితం చేశారు. దేశంలో కులగణన చేపట్టిన తొలి రాష్ట్రం తెలంగాణే. రాహుల్ విజన్ తో రాష్ట్రంలో కులగణన చేపట్టాం. కులగణన కోసం కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా పోరాడింది. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఢిల్లీలోనూ ఆందోళన చేశారు. తెలంగాణ చేసింది, దేశం అనుసరిస్తోందని మరోసారి రుజువైంది అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. మరోవైపు, మంత్రులు, కాంగ్రెస్ నేతలు కూడా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. కేంద్రం దేశ వ్యాప్తంగా చేపట్టనున్న జనాభా లెక్కల్లో కులగణన చేస్తామనడం తెలంగాణ ప్రభుత్వ విజయమన్నారు

2లో..

# పాకిస్తాన్‌పై 24గంటల్లో భారత్ సైనిక చర్య
## - పాక్‌లో భయాందోళన



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్తాన్‌పై భారతదేశం యుద్ధం చేయబోతుందని పాక్ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే 24-36 గంటల్లో పాకిస్తాన్‌పై భారతదేశం దాడి చేస్తుందని సైనిక చర్యకు ప్రణాళిక రూపొందించినట్లుగా విశ్వసనీయ సమాచారం ఉందని సమాచార మంత్రి అతుల్లా తరార్ పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం త్రివిధ దళాలతో కీలక సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. సాయుధ దళాల సామర్థ్యంపై ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారత సైన్యం తమపై దాడి చేయబోతుందనే భయాందోళనలకు గురవుతున్నది. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ ప్రమేయం ఉందనే నిరాధార ఆరోపణలతో సైనిక చర్య తీసుకునేందుకు భారత్ సిద్ధమవుతోందని పాకిస్తాన్ సమాచార మంత్రి అతుల్లా తరార్ పేర్కొన్నారు. పాకిస్తాన్ సైతం ఉగ్రవాద బాధిత దేశంగా ఉందని పేర్కొన్నారు. పహల్గాం దాడిలో నిజానిజాలను తెలుసుకునేందుకు ఇస్లామాబాద్ నిపుణుల కమిషన్ ద్వారా విశ్వసనీయమైన, పారదర్శకమైన స్వతంత్ర దర్యాప్తునకు ప్రతిపాదించిందని భారత్ ఇందుకు అంగీకరించలేదన్నారు. భారత్ కావాలనే యుద్ధం చేస్తుందన్నారు.

2లో..

# గ్రూప్-1 వ్యవహారంపై టీజీపీఎస్సీ చైర్మన్‌కు బండి లేఖ
## - అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు స్పందించిన బండి సంజయ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల వ్యవహారంపై నెలకొన్న వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ పరీక్షల నిర్వహణ తీరుపై సమగ్ర సమాచారాన్ని వారం రోజుల్లోగా అందించాలని కోరుతూ ఆయన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశంకు లేఖ రాశారు. గ్రూప్-1 పరీక్షల ప్రక్రియలో అవకతవకలు, లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ అభ్యర్థులు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత

2లో..

# హైదరాబాద్ పోలీస్‌స్టేషన్ల పేర్లు మార్పు
## *- 146 మంది సీఐల బదిలీ*




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాలనా సౌలభ్యం, ప్రజలకు సులువుగా అర్థమయ్యేందుకు వీలుగా కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. పలు పోలీస్ స్టేషన్ల పేర్లను మార్చడంతో పాటు, కొత్తగా ఒక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో, కమిషనరేట్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను (సీఐలను) బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని ప్రఖ్యాత ప్రాంతాల పేర్లను ప్రతిబింబించేలా కొన్ని పోలీస్ స్టేషన్లు, డివిజన్ల పేర్లను మార్చినట్లు సీపీ సీవీ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

2లో..

# విజయవాడలో వైఎస్ షర్మిలపై బీజేవైఎం దాడి
## - తీవ్ర ఉద్రిక్తత



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రధాని మోడీ అమరావతికి రాకవేళ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై బుధవారం విజయవాడలో బీజేవైఎం కార్యకర్తలు దాడికి దిగారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్ దగ్గర నిరసనకు దిగిన షర్మిలపై బీజేవైఎం కార్యకర్తలు కోడిగుడ్లు, టమోటాలతో దాడి చేశారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. షర్మిల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై చేసిన వ్యాఖ్యల్ని నిరసిస్తూ బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ నేతృత్వంలో రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం ముట్టడించారు. కాంగ్రెస్ కార్యాలయం ముట్టడి కోసం వచ్చిన

2లో..

# 10 ఏళ్లు అధికారంలో మేము.. ఫాంహౌస్‌లో మీరు

అక్కడ ప్రస్తావించి ఉంటే నిజంగానే ప్రజలు అభినందించే వాళ్లు. ఇన్నాళ్లుగా ఆయన ఇంట్లో నుంచి కాలు కదపకుండా జీతభత్యాలు తీసుకున్నారు. ఇది ఏ చట్టంలో ఉంది?. ప్రతిపక్ష నాయకుడిగా రూ.65 లక్షలు, వాహనాలు, పోలీస్ భద్రత తీసుకున్నారు." అని రేవంత్ విమర్శఇంచారు. ప్రతిపక్ష నాయకుడిగా పని చేయకుండా ఫామ్ హౌస్‌లో ఎందుకు పడుకున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారని బీఆర్ఎస్‌ను నిలదీశారు రేవంత్ రెడ్డి. ఫామ్ హౌస్‌లో పడుకుని ప్రజలకు ఏం సందేశం ఇవ్వదలచుకున్నారని నిలదీశారు. ఇంకా ఏమన్నారంటే సంక్షేమ పథకాలు ఆగిపోయాయని ఆయన మాట్లాడిండు. రైతు బంధు, ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వీటిలో ఏది ఆగిపోయింది?. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం, ఇవేవీ మీకు కనిపించడంలేదా?. మీరు ఏ మత్తులో తూగుతున్నారో మీకే తెలియాలి." అని ధ్వజమెత్తారు. కావాలని ప్రభుత్వాన్ని టార్గెట్ చేసుకుంటున్నారని మండిపడ్డారు రేవంత్ రెడ్డి. "కడుపు నిండా విషం పెట్టుకుని విద్వేషపూరిత ప్రసంగం చేసి ప్రజల్ని రెచ్చగొట్టి ఏం చేయాలనుకుంటున్నారు?. ప్రజలు విజ్ఞులు, ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు. పదేళ్లు ప్రజలు మెచ్చే పరిపాలన చేస్తాం. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ చేద్దాం రండి. కాళేశ్వరం, ఉచిత బస్సు, రుణమాఫీ, రైతు బంధు, మేం ఇచ్చిన 60 వేల ఉద్యోగాలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన వీటిలో దేనిపై చర్చ చేద్దాం చెప్పండి కేసీఆర్. చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం" అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కేసీఆర్ మాటల్లో, కళ్ళల్లో విషం కనిపిస్తోందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా? అని ప్రశ్నించారు. పదేళ్లు దోచుకున్న కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదని అన్నారు. ఆగమైంది తెలంగాణ కాదు కేసీఆర్ కుటుంబమేనన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రకు వెళ్లినట్లు కెసిఆర్ వరంగల్ వెళ్లారని ఎద్దేవా చేశారు. ఆయన వరంగల్ వెళ్లి పాపాలు కడిగేసుకున్నట్టు ఫీల్ అవుతున్నారని కానీ అక్కడికి వెళ్లి అబద్ధాలు మాట్లాడి ఇంకో తప్పు చేశారన్నారు. వరంగల్ సభలో పేరు కూడా పలకలేకపోయారని ఫైర్ అయ్యారు. బసవేశ్వరుడి స్ఫూర్తితో రాష్ట్ర ఆదాయం పెంచాలని అభిప్రాయపడ్డారు రేవంత్ రెడ్డి. పేదలకు పంచాలి అనే విధానంతో ముందుకెళ్తున్నామన్నారు. ప్రజలకు మేలు చేయడమే తమ పని అని ప్రచారం చేయాల్సింది ప్రజలే అని చెప్పుకొచ్చారు. ప్రజలే తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు అని అభివర్ణించారు.

# రాజకీయ కోణంలో కుల సర్వేలు చేశాయని విమర్శించారు

### కాంగ్రెస్ చేసిన సర్వేలో పారదర్శకత లేదు..

కాంగ్రెస్ పాలిత తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన సర్వేలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్, దాని ఇండియా కూటమిలు కుల గణనను రాజకీయ సాధనంగా ఉపయోగించాయని ఆరోపించారు. కొన్ని రాష్ట్రాలు కులాల జాబితాను బాగానే తయారు చేశాయని కానీ మరికొన్ని రాష్ట్రాలు రాజకీయ కారణాల వల్ల సరిగా చేయలేదని పేర్కొన్నారు. ఇలాంటి సర్వేల వల్ల ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. రాజకీయాల వల్ల సమాజంలో గందరగోళం ఏర్పడకుండా ఉండాలంటే సర్వేల బదులు జనాభా లెక్కల్లో కులాల వివరాలు సేకరించాలి అని మంత్రి అన్నారు.

### కులగణన వల్ల కులాల మధ్య సమానత్వం..

జనాభా లెక్కల్లో కులాల వివరాలు సేకరించడం వల్ల చాలా ఉపయోగం ఉంటుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఏ కులంలో ఎంత మంది ఉన్నారో తెలుస్తుందన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలు అందరికీ అందుతాయన్నారు. కులాల మధ్య సమానత్వం కూడా వస్తుందని స్పష్టం చేశారు.

# సింహాచలం చందనోత్సవంలో విషాదం

గోడ కూలిపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఇక కూలిపోయిన గోడకు–క్యూలైన్‌కు దాదాపు మూడు అడుగుల గ్యాప్ ఉంది. వర్షానికి మట్టిపెళ్లలు గోడ మీద పడగానే ఒక్కసారిగా గోడ కూలిపోయింది. వీటన్నింటిని పరిశీలిస్తే గోడ కూలడానికి కచ్చితంగా నిర్మాణ లోపమే కారణం అంటున్నారు అధికారులు.

### బాధిత కుటుంబాలను ఆదుకున్న ఏపీ ప్రభుత్వం

చనిపోయిన ఏడుగురు భక్తుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనలో గాయపడిన వారికి రూ.3 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయ శాఖలో పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం ఇవ్వాలని మంత్రులకు సూచించారు.

### ఇలాంటివి జరగకుండా చూడాలన్న చంద్రబాబు

సీఎం చంద్రబాబు బుధవారం ఉదయం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ఎంపి భరత్, సింహాచల దేవాలయ ధర్మకర్త అశోక్ గజపతి రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా అధికారులతో మాట్లాడి ఘటన జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయం వివరాలు తెలుసుకున్నారు. ఇలాంటివి జరగకుండా ఇకనుంచి పటిష్ట చర్యలు తీసుకోవాలని మంత్రులు, అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

# టీజీపీఎస్సీపై హైకోర్టు ప్రశ్నల వర్షం

సుమారు 20 రోజుల తర్వాత తుది మార్కులను ప్రకటించారని తెలిపారు. ఈ మధ్యకాలంలో అవకతవకలు జరిగి ఉండవచ్చనే అనుమానాన్ని వారు వ్యక్తం చేశారు.పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, టీజీపీఎస్సీ అనుసరించిన మూల్యాంకన ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకుంది. ముఖ్యంగా, తెలుగు మాధ్యమంలో పరీక్ష రాసిన అభ్యర్థుల జవాబు పత్రాలను ఎలా మూల్యాంకనం చేశారని ప్రశ్నించింది. "తెలుగులో పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వేశారనే ఆందోళన వ్యక్తమవుతోంది. మూల్యాంకనం కోసం జవాబులకు సంబంధించి ఏదైనా 'కీ' పేపర్ ఉంటుందా? తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాలకు వేర్వేరుగా 'కీ' ఇచ్చారా?" అంటూ టీజీపీఎస్సీని న్యాయస్థానం ప్రశ్నించింది. దీనికి టీజీపీఎస్సీ ప్రతినిధులు స్పందిస్తూ, ఇది రాతపూర్వక పరీక్ష అయినందున మూల్యాంకనం చేసే నిపుణులకు ఎలాంటి 'కీ' పేపర్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. జవాబు పత్రాలను దిద్దిన వారంతా సంబంధిత సబ్జెక్టులలో నిపుణులని, వారి నైపుణ్యం ఆధారంగానే మూల్యాంకనం జరిగిందని కోర్టుకు వివరించారు. అనంతరం, ఈ గ్రూప్–1 పరీక్షలో తెలుగు మాధ్యమంలో ఎంతమంది పరీక్ష రాశారు, వారిలో ఎంతమంది తుది ఎంపిక జాబితాలో ఉన్నారు అనే వివరాలను సమర్పించాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. గతంలో జరిగిన గ్రూప్–1 పరీక్షకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందిస్తామని కమిషన్ కోర్టుకు తెలియజేసింది. రాష్ట్రంలో ఎంతోమంది నిరుద్యోగులు ఏళ్ల తరబడి గ్రూప్–1 నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, ఈ నేపథ్యంలో కేసు విచారణను అనవసరంగా ఆలస్యం చేయకుండా త్వరితగతిన ముగించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. తదుపరి విచారణను న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది.

# హైదరాబాద్ పోలీస్‌స్టేషన్ల పేర్లు మార్పు

దీని ప్రకారం, ఇప్పటివరకు సచివాలయం పోలీస్ స్టేషన్‌గా ఉన్న పేరును 'లేక్ పోలీస్ స్టేషన్'గా మార్చారు. అదేవిధంగా, హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను 'మెహదీపట్నం పోలీస్ స్టేషన్'గా, షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను 'గోషామహల్ పోలీస్ స్టేషన్'గా మారుస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వీటితో పాటు, టోలిచౌకి ప్రాంతంలో 72వ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేసినట్లు సీపీ పేర్కొన్నారు. సుమారు 35 సంవత్సరాల తర్వాత హైదరాబాద్ కమిషనరేట్‌లో పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటివరకు నగరంలో 71 లా అండ్ ఆర్డర్, 31 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయని ఆయన వివరించారు. గత రెండేళ్లుగా పోలీస్ స్టేషన్ల హద్దుల విషయంలో కొన్ని సమస్యలు, లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ ఠాణాలపై ప్రజల్లో గందరగోళం నెలకొన్నాయని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించగా, మార్పులకు ఆమోదం లభించిందని తెలిపారు. పోలీస్ స్టేషన్ల పూర్తి వివరాలు, వాటి పరిధిని హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక వెబ్‌సైట్‌లో త్వరలో అందుబాటులో ఉంచుతామని సీపీ స్పష్టం చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ పరిపాలనా ప్రక్షాళన జరిగింది. మొత్తం 146 మంది సీఐలను బదిలీ చేస్తూ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలతో పాటు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న సీఐలు ఈ బదిలీల జాబితాలో ఉన్నారు. కమిషనరేట్ పరిధిలో పాలనను మరింత మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# సింహాచలం దుర్ఘటన బాధితులకు రూ.కోటి ఇవ్వాలి

అయ్యిందని మండిపడ్డారు. ప్రజలు, భక్తులు అంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చందనోత్సవం జరుగుతుంది, భక్తులు భారీగా తరలివస్తారని ప్రభుత్వానికి ముందుగా తెలియదా అని ప్రశ్నించారు. లక్షల్లో భక్తులు వస్తారని తెలిసి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఏడుగురు భక్తుల ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు. ఆలయంలో కనీస సౌకర్యాలు కల్పనలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

### రెండు రోజుల ముందు గోడ నిర్మించడం ఏంటీ.?

చందనోత్సవం ఎప్పుడు నిర్వహిస్తారో ముందుగానే తెలిసినా చివరి నిమిషంలో గోడ కట్టాల్సిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు జగన్. రెండుల కిందట పది అడుగుల ఎత్తు, డబ్బై అడుగుల పొడవు ఉన్నగోడని ఎలా నిర్మించారని నిలదీశారు. ఈ గోడ కట్టేందుకు కనీసం టెండర్లు కూడా పిలవలేదని మండిపడ్డారు. అదైనా ముందే కట్టి ఉంటే ఇంతటి విపత్తు జరిగేది కాదని అభిప్రాయపడ్డారు. చేసిన పనులు కూడా నాణ్యత చేయలేదని వర్షానికే గోడ కూలిపోవడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

### చంద్రబాబు తప్పిదమే ఇదంతా

ఇంతటి ఘోరం జరిగిన వెంటనే తప్పును తమపై నెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయని జగన్ అన్నారు. కాని వాళ్ల హయాంలోనే పనులు కేటాయించినట్టు తెలిసి సైలెంట్ అయిపోయారని అన్నారు. చంద్రబాబు తన రాజకీయాల కోసం దేనికైనా సిద్ధపడతారని మండిపడ్డారు. నాడు పుష్కరాల నుంచి నేటి చందనోత్సవం వరకు జరిగిన దుర్ఘటనల్లో ప్రధాన ముద్దాయి చంద్రబాబే అన్నారు. ప్రభుత్వం అంటే ప్రజలకు భరోసా ఇవ్వాలని కానీ ఈ ప్రభుత్వం ప్రాణాలు తీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బాధితులకు ఇచ్చే పరిహారం పెంచాలి

ఇప్పుడు జరిగిన దుర్ఘటనలో కూడా తాను వస్తున్నానని చెప్పిన తర్వాత పాతిక లక్షల పరిహారం ప్రకటించారని జగన్ ఆరోపించారు. ఇది ప్రభుత్వం చేసిన తప్పిదం కారణంగా జరిగిన దుర్ఘటన కాబట్టి పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. తమ హయాంలో ఇలాంటివి జరిగితే మానతాదృక్పథంతో పరిహారం సక్రమంగా అందజేశామన్నారు జగన్. ఇప్పుడు కూడా తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సింహాచల చందనోత్స దుర్ఘటనలో బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఇలాంటి ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటే రిపీట్ కాకుండా ఉంటాయని జగన్ సూచించారు.

# తెలంగాణ చేసింది దేశం అనుసరిస్తుంది

మంత్రి పొన్నం ప్రభాకర్. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా సామాజిక అసమానతలు తొలగించడానికి దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన చేసి దేశానికి దుక్సూచిగా మారిందన్నారు. కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని పొన్నం తెలిపారు. కుల గణన కేంద్రం నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయమని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జనగణనతోపాటు కులగణన నిర్వహిస్తామనడం హర్షించదగిన విషయమన్నారు. రాహుల్ ఆలోచన మేరకు రాష్ట్రంలో కులగణన సర్వే చేపట్టామన్నారు. కేంద్రం ఎట్టకేలకు ప్రజల ఒత్తిడితో కులగణనకు ఒప్పుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అదే బాటలో తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

# విజయవాడలో వైఎస్ షర్మిలపై బీజేవైఎం దాడి

బీజేవైఎం కార్యకర్తలకూ, కాంగ్రెస్ కార్యకర్తలకూ మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకున్నా ఇరుపక్షాల మధ్య బాహా బాహీ కొనసాగింది. ఈ సందర్భంగా వైఎస్ షర్మిలకు వ్యతిరేకంగా బిజేవైఎం కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో బిజేవైఎం నేతల ను పోలీసులు అదుపులో కి తీసుకున్నారు. బీజేవైఎం కార్యకర్తల తీరుపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి నాయకులు అధికార మదంతో వ్యవహరిస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఏపీలో వైసిపి ఉన్నా, కూటమి ఉన్నా అధికార పెత్తనం మాత్రం బిజెపిదే అన్నారు. గత పదకొండేళ్లుగా రాష్ట్రాన్ని మోడీ నాశనం చేశారన్నారు. టిడిపి, జనసేన, వైసిపి నాయకులూ ఎలాగూ పశ్నించరని, మోడీ మోసాలను నిలదీస్తే తనను టార్గెట్ ఛేసి దాడి చేయిస్తారా అని షర్మిల ప్రశ్నించారు. కోడి గుడ్లు, టమాటాలతో దాడి చేస్తారా అని అడిగారు. ఏపీసీసీ అధ్యక్షురాలి పైనే ఇలా దాడికి తెగబడితే మా కాంగ్రెస్ నాయకుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లోపలకు వచ్చారంటే పోలీసులు సహకారం లేకుండా వస్తారా అని అడిగారు. ఎవరైతే ఇప్పుడు దాడిలో ఉన్నారో అందరి పైనా హత్యా యత్నం కేసులు నమోదు చేయాలన్నారు. మీ అన్యాయాలను ప్రశ్నిస్తే సహించలేరా మోసాలు బయట పెడితే దాడి చేస్తారా అని షర్మిల నిలదీశారు. ఈ ఘటనలపై కూటమి ప్రభుత్వం తనకు సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు ఇదేనా మీ పాలనలో మహిళలకు జరిగే న్యాయం అన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం, పోలీసులు వారి పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఉదయం గతంలో ప్రధాని మోడీ అమరావతికి శంఖుస్థాపన చేసిన స్థలానికి వెళ్లేందుకు ప్రయత్నించిన వైఎస్ షర్మిలను పోలీసులు అడ్డుకున్నారు. గన్నవరంలోని ఆమె ఇంట్లోనే హౌస్ అరెస్టు చేశారు. దీనిపై షర్మిల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు కూడా షర్మిల హౌస్ అరెస్టును ఖండిస్తూ ట్వీట్లుచేశ్శారు. అనంతరం వైఎస్ షర్మిలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించారు.

# గ్రూప్-1 వ్యవహారంపై టీజీపీఎస్సీ చైర్మన్‌కు బండి లేఖ

సంతరించుకుంది. గ్రూప్–1 పరీక్షల విషయంలో తమకు అనేక సందేహాలున్నాయని, అవినీతి, అక్రమాలు జరిగాయని కొందరు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు అభ్యర్థులు ఇటీవల బండి సంజయ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న బండి సంజయ్, ఈ మేరకు టీజీపీఎస్సీకి లేఖ రాశారు. అభ్యర్థులు లేవనెత్తిన ప్రధాన సందేహాలను, ఆరోపణలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. గ్రూప్–1 పరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను వారం రోజుల్లోగా అందజేయాలని టీజీపీఎస్సీ చైర్మన్‌ను కోరారు.

# మైండ్ గేమ్ లో మావోయిస్టులు

**వరంగల్ :** బచావో కర్రెగుట్టల పేరుతో.. భద్రతా బలగాలు దూసుకెళ్లాయి. దాదాపు ఏడు రోజులుగా జల్లెడ పడుతున్నాయి. భారీ సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో సాయుధ బలగాలు ముందుకెళ్లినా.. ఫలితం లేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే.. మావోయిస్టులు కావాలనే భద్రతా బలగాలను కర్రెగుట్టల వైపు రప్పించారా.. బలగాల దృష్టి మరల్చి మరో ప్రాంతానికి వెళ్లారా అనే చర్చ జరుగుతోంది. మావోయిస్టులు మరేదో వ్యూహం పన్నారనే చర్చ నడుస్తోంది.రెండు వారాల కిందట మావోయిస్టులు ఓ లేఖను విడుదల చేశారు. తమ రక్షణ కోసం కర్రెగుట్టల్లో బాంబులు అమర్చామని.. ఆదివాసీలు ఇటువైపు రావొద్దని హెచ్చరించారు. ఆ లేఖ కాస్త చర్చనీయాంశంగా మారింది. అయితే.. రాజ్యానికి బలం ఎక్కువ అని తెలిసి.. తాము ఉన్నచోటును మావోయిస్టులు ఎందుకు చెప్తారనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ లేఖ ద్వారా బలగాలను ఇటువైపు రప్పించి.. మావోలు మరో ప్రాంతానికి వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కర్రెగుట్టల్లో బాంబులు అమర్చినట్టు మావోయిస్టులు ప్రకటన చేసి.. అగ్రనేతలను సేఫ్ ప్లేస్‌కు తరలించినట్టు ప్రచారం జరుగుతోంది. వ్యూహాత్మకంగానే మావోలు ఈ ప్రకటన చేశారని.. తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల్లోని అడవుల్లో కూంబింగ్ చేస్తున్న బలగాలు కూడా ఇక్కడికి రావడంతో.. మావోయిస్టులు వేరే ప్రాంతానికి సులభంగా వెళ్లి ఉంటారనే చర్చ జరుగుతోంది. దీనిపైనా బలగాలు ఆలోచిస్తున్నట్టు సమాచారం.నిజంగా మావోయిస్టులు కర్రెగుట్టల్లో ఉంటే.. బలగాలు డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించాయి. కానీ.. ఆశించిన స్థాయిలో మావోల కదలికలు గుర్తించలేదు. అంటే అసలు కర్రెగుట్టల్లో వారు లేరనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఒకవేళ ఉంటే.. ఇన్నిరోజులు కూంబింగ్ జరుగుతున్నా.. వేలాది మంది జవాన్లు జల్లెడ పడుతున్నా.. ఎవ్వరూ ఎందుకు కనిపించరనే ప్రశ్న.. హాట్ టాపిక్‌గా మారింది.వాస్తవానికి కర్రెగుట్టలు చాలా ఎత్తులో ఉంటాయి. ఒకవేళ నిజంగా మావోయిస్టులు ఆ గుట్టలపై ఉన్నారనుకున్నా.. వారికే అనుకూల పరిస్థితులు ఉంటాయి. బలగాలు కింది నుంచి గుట్టలపైకి ఎక్కాలి. ఈ క్రమంలో కాల్పులు జరిగితే.. ఇరువైలా భారీగా ప్రాణ నష్టం ఉండేది.. అని గతంలో ఆ ప్రాంతంలో పనిచేసిన ఓ రిటైర్డ్ పోలీస్ అధికారి వెల్లడించారు. ఇప్పటికే మావోయిస్టులు ఎత్తైన ప్రాంతంలో ఉంటే.. పైనుంచి కాల్పులు జరపడం ఈజీ అని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. కర్రెగుట్టల ప్రాంతంలో వడగాలులు బలంగా వీస్తున్నాయి. ఇలాంటి సమయంలో కూంబింగ్ సజావుగా సాగడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే చాలామంది జవాన్లు వడదెబ్బకు గురయ్యారు అనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బలగాలు ప్లాన్ మార్చుకున్నట్టు తెలుస్తోంది. ఇలా కూంబింగ్, దాడులు కాకుండా.. బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

# గ్రాండ్‌గా గ్రౌండ్ ప్లానింగ్...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ పనిచేసినా చాలా పకడ్బందీగా చేస్తారు. ఆయన డ్రీమ్ ప్రాజెక్టును లాంచ్ చేయడానికి ఎప్పుడైనా గ్రాండ్ గానే ప్లాన్ చేస్తారు. దానివల్ల ప్రచారంతో పాటు హైప్ క్రియేట్ అవుతుందని, దాని వల్ల రాష్ట్రానికి ఎంతో ఉపయోగముంటుందని చంద్రబాబు భావిస్తారు. ఇప్పటి వరకూ పదిహేనేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలోనూ ప్రతి పనికీ రాజకీయాన్ని జోడించి తనకు కీర్తి ప్రతిష్టల స్థాయిని మరింత పెంచేలా చంద్రబాబు డిజైన్ చేస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇప్పటికీ హైదరాబాద్ ఐటీ రంగంలో అభివృద్ధి చెందిందని అన్నా, నేటికీ హైదరాబాద్ అత్యధికంగా ఆదాయాన్ని ఆర్జించి పెట్టే ప్రాంతంగా తీర్చిదిద్దింది ఎవరన్నా ప్రత్యర్థులు సయితం చంద్రబాబు వైపు వేళ్లు చూపించాల్సిందే.సంపద పెరుగుతుందని... అదే చంద్రబాబు నాయుడు కోరుకునేది. కావాల్సింది. అందుకే తాజాగా అమరావతి రాజధాని పునర్మిరాణ పనుల ప్రారంభం పేరిట చంద్రబాబు చేస్తున్న హడావిడి వెనక కూడా అంతే బలీయమైన ఆకాంక్ష ఉందంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని పనులకు శంకు స్థాపనలు చేసి వెళ్లిన తర్వాత ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ధరలు మరింత పెరుగుతాయని ఆయనకు తెలుసు. నిర్మాణ పనులు ప్రారంభమయిన తర్వాత ఇక్కడ ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు వచ్చి రియల్ వ్యాపారం ఊపందుకుని పరోక్షంగా ప్రభుత్వానికి కూడా సంపద చేకూరుతుందని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో అనేక సంస్థలు కూడా అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని చంద్రబాబు ఆశిస్తున్నారు. . అమరావతి పునర్నిర్మాణం పేరుతో ఖర్చు పెట్టే ప్రతి పైసా రాష్ట్రానికి అంతే వేగంగా తిరిగి వస్తాయని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకోసమే కొంత ఆర్భాటమైనా తాను అనుకున్నది చేసి తీరాలన్న పట్టుదలతో చంద్రబాబు ఉన్నారు. ఒకటి కాదు..రెండు కాదు.. లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి అదనంగా సంపదను సమకూర్చుకోవాలంటే ఆ మాత్రం రిస్క్ తీసుకోక తప్పదు. వాస్తవానికి అయితే మరో ఏ ముఖ్యమంత్రి అయినా రాజధాని పునర్నిర్మాణ పనులు పేరిట ఇంత పెద్ద స్థాయిలో సభను ఏర్పాటుచేయరు. కానీ చంద్రబాబు ఆలోచన మాత్రం వేరుగా ఉంటుంది. అమరావతి కల సాకారమయితే తన పేరు చిరస్థాయిగా మిగిలిపోతుందన్న భావనతో ఆయన ఒక్కొక్క అడుగూ ముందుకు వేస్తున్నారు.. ప్రధాని నరేంద్ర మోదీ రావడంతో కొంత హైప్ రావడమే కాకుండా ఈ కార్యక్రమంతో చంద్రబాబుకు తన ఇమేజ్ కూడా మరింత పెరుగుతుందని తెలుసు. ఒకవైపు అభివృద్ధి మరొకవైపు సంక్షేమాన్ని కలగలుపుతూ తీసుకెళ్లేది చంద్రబాబు మాత్రమేనని ఇప్పటికే ప్రజలు నమ్ముతారు. ఆ నమ్మకం చెక్కు చెదరకుండా ఉండేందుకే చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని నిర్మాణ పనుల కు శంకుస్థాపన కార్యక్రమానికి భారీగా ప్లాన్ చేసినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. మరొక వైపు దేశంలోనే అమరావతి బ్రాండ్ ఇమేజ్ పెరగడం ఖాయమని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడు ఆలోచనలు గ్రౌండ్ అయితే మాత్రం గ్రాండ్ సక్సెస్ అయినట్లేనని అనుకోవాల్సి ఉంటుంది.

# అనంతపురంలో 'అమ్మ రాజీనామా' కథ.. '

### – పాపకు ఏమీ కాని ఓ తల్లి' లేఖ

**అనంతపురం:** అమ్మ రాజీనామా.. ఇది ఒక సినిమా పేరు.. కానీ రియల్ లైఫ్‌లోనూ ఓ తల్లి అమ్మ పదవికి రాజీనామా చేసింది. కొన్ని అనివార్య కారణాలతోనే అమ్మ పదవికి న్యాయం చేయలేకపోతున్నానని.. పొత్తిళ్లలో ఉండాల్సిన తన పసిపాపను తీసుకెళ్లి రోడ్డు పక్కన వదిలేసింది. శిశువుకు చక్కగా స్నానం చేయించి ఓ బేబీ బెడ్‌లో పడుకోబెట్టి రోడ్డు పక్కన ఉంచింది. తాను అమ్మ పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా ఓ లేఖను రాసి.. అందులో తన పాపను రోడ్డుపై ఎందుకు అలా అనాథగా వదిలి వెళ్లాల్సి వచ్చిందో వివరించింది. ఆ లేఖలో చివరిగా రాసిన ఐదు పదాలు ఎమోషనల్‌గా ఉన్నాయి.అనంతపురంలోని విజయనగరం కాలనీ అది.. అప్పుడే పుట్టిన ఆడ శిశువును రోడ్డు పక్కన వదిలేసి వెళ్లారు. పసికందు ఏడుపు విని అక్కడికి వెళ్లిన స్థానికులు చిన్నారిని అక్కున చేర్చుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు పాపను తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్చారు.. ఆ తర్వాత ఐసీడీఎస్ అధికారులు అక్కడికి వచ్చారు. చిన్నారిని తమ సంరక్షణలో ఉంచేందుకు తీసుకెళ్లారు. అయితే శిశువు దగ్గర తల్లిదండ్రులు రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.ఆ లేఖలో.. 'ప్రియమైన మేడం, సార్ గారికి నా నమస్కారాలు.. నా కూతుర్ని నేను పోషించలేను.. మీరే నా కూతురికి ఒక మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటూ.. మీ దగ్గర వదిలి వెళ్లిపోతున్నాను. తన జీవితం బాగుండాలి.. తనని మీరే బాగా చూసుకోవాలని వేడుకుంటున్నాను. నేను చనిపోతున్నాను. నా కూతుర్ని బాగా చూసుకోండి సార్ ప్లీజ్.. ఒక తల్లిగా నా ఆవేదన.. పాపకి ఏమీ కాని ఓ తల్లి' అంటూ ఓ నోట్‌ను ఆ చిన్నారి పాప పక్కనే వదిలేసి వెళ్లారు. పాపను రోడ్డు పక్కన వదిలేసి ఈ లేఖ ఉంచింది ఎవరు అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.. దగ్గరలోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించే పనిలో ఉన్నారు. అలాగే అనంతపురం పోలీసులు పాప గురించి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న స్థానికుల్ని అడిగి తెలుసుకుంటున్నారు.

# సాకేకు ప్రమోషన్

**అనంతపురం :** 2024 ఎన్నికల ఫలితాలతో డీలాపడిన వైసీపీలో పునరుత్తేజం తెచ్చేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే పార్టీలో పదవుల భర్తీ చేపడుతున్నారు. క్షేత్ర స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మించాలని భావిస్తున్న వైఎస్ జగన్.. ఆ క్రమంలో పలు స్థానాలకు ఇంఛార్జులను, సమన్వయకర్తలను నియమిస్తున్నారు. తాజాగా శింగనమల నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను.. వైఎస్ జగన్ నియమించారు. 2024 ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం నుంచి వీరాంజనేయులును వైఎస్ జగన్ బరిలో నిలిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన జొన్నలగడ్డ పద్మావతిని కాదని.. వీరాంజనేయులను బరిలో దింపారు. టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసిన నేపథ్యం ఉన్న వీరాంజనేయులుకు టికెట్ ఇవ్వటం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ చేతిలో వీరాంజనేయులు ఓటమి పాలయ్యారు.అయితే తాజా రాజకీయ పరిస్థితుల్లో సాకే శైలజానాథ్‌ను శింగనమల వైసీపీ ఇంఛార్జిగా జగన్ నియమించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన సాకే శైలజానాథ్ 2025 ఫిబ్రవరిలో వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచి వైసీపీ తరుఫున కూటమి ప్రభుత్వ విధానాలపై గళమెత్తుతున్నారు. తాజాగా ఆయనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తూ జగన్ నిర్ణయించుకోవడం విశేషం. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ద్వారా సాకే శైలజానాథ్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. శింగనమల నుంచి 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు.అయితే రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి దిగజారింది. ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అభ్యర్థులను కూడా బరిలో దింపలేని పరిస్థితికి చేరుకుంది. అయినప్పటికీ సాకే శైలజానాథ్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. 2022లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూడా సాకే శైలజానాథ్ పనిచేశారు. అయితే 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు శైలజానాథ్ టీడీపీలో చేరతారనే ప్రచారం జరిగింది. జేసీ దివాకర్ రెడ్డిని కలవడంతో సాకే శైలజానాథ్ టీడీపీలో చేరబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శింగనమల నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో వైఎస్ జగన్‌ను కలిసిన సాకే శైలజానాథ్ వైసీపీలో చేరారు. ఇప్పుడు శింగనమల వైసీపీ ఇంఛార్జిగా నియమితులయ్యారు.

# హోటల్లో ఘోర అగ్నిప్రమాదం

### – 14 మంది మృతి



కోల్కొత్తలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మంగళవారం రాత్రి సెంట్రల్ కోల్కతాలోని ఒక హోటల్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 14 మంది మృతి చెందారని పలువురు తీవ్రంగా గాయపడ్డారని నగర పోలీస్ కమిషనర్ మనోజ్ కుమార్ వర్మ వెల్లడించారు.చికిత్స కోసం క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ఈ ఘటనపై సమాచారం అందగానే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారన్నారు.
అలాగే సహాయక చర్యలు సైతం వారు చేపట్టారని వివరించారు. హోటల్‌లో చిక్కుకున్న పలువురిని వారు రక్షించారని తెలిపారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదన్నారు. ఈ అగ్ని ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. అందుకోసం ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు.

## సంపాదకీయం

## అందుతున్న మేకిన్ ఇండియా ఫలాలు

మన పరిశ్రమలు కొత్త భారత్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి. భారత పారిశ్రామిక రథానికి చోదక శక్తిగా పనిచేస్తున్నాయి. మేక్ ఇన్ ఇండియాకు అసలైన మోడల్ గా నిలుస్తున్నాయి. భారత్ మారుతోంది. ఒప్పుడు ఎన్నో దిగుమతులు.. ఇప్పుడు అన్నీ ఉత్పత్తులే. మేకిన్ ఇండియా నినాదం క్రమంగా ప్రతిఫలాలను ఇస్తోంది. ప్రధాని మోదీ కలలు సాకారమవుతుండడంతో పాటు.. దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. 2014లో ప్రతిష్టాత్మకంగా మేకిన్ ఇండియాను లాంచ్ చేశారు మోదీ. భారత్‌ను ప్రపంచంలో టాప్ ఉత్పత్తి దేశంగా మార్చేందుకు కలలు కన్నారు. దీనికోసం పక్కా ప్రణాళికలతో ముందుకు సాగారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు దాని ప్రతిఫలాలను దేశం చూస్తోంది. 2014లో దేశంలో 80శాతం మొబైల్ ఫోన్లను దిగుమతి చేసుకునే పరిస్థితుల్లో ఉంటే.. ఇప్పుడు 99.9శాతం మొబైల్స్ ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. అంతేకాదు.. యూకే, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, ఇటలీ, సౌతాఫ్రికా వంటి దేశాలకు ఎగుమతులు కూడా సాగుతున్నాయి. డిఫెన్స్ ప్రొడక్షన్‌తోపాటు.. అంతరిక్షం, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్ల తయారీ, నిర్మాణ రంగం, రైల్వే ఇన్‌ఫ్రాలోనూ అద్భుత ఫలితాలను సాధిస్తోంది.స్వదేశీ కంపెనీలైన పతంజలి, టాటా, అమూల్ వంటివి ఇండియన్ గ్రోత్ స్టోరీని మారుస్తున్నాయి.స్వదేశీ ఉద్యమం స్వాతంత్ర పోరాటంలో కీలకమైన ఘట్టం. ఇప్పుడు మరోసారి అదే స్వదేశీ ఉద్యమం.. భారత్ స్వయ సంవృద్ధి పయనాన్ని నిర్దేశిస్తోంది. ఇది ఆర్థిక స్వావలంబనను మాత్రమే కాదు.. జాతీయ గౌరవాన్ని, సాంస్కృతిక గుర్తింపును ఇనుమడింపజేస్తోంది. స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనే భావన, తద్వారా జాతీయ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్న ఆకాంక్ష ఈ మధ్య కాలంలో పెరుగుతోంది. ఆర్థిక వ్యవస్థ బలోపేతం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలిపే కార్యక్రమంలో అనేక స్థానిక పరిశ్రమలు నిరంతరం పనిచేస్తున్నాయి.భారత్ పరిశ్రమకు నిదర్శనంగా నిలిచే పతంజలి.. ఈ విషయంలో ఎంతో ముందడుగు వేసింది. బ్రాండ్ భారత్ ను ప్రమోట్ చేయడంలో ఎంతో ముందుంది. భారత్ ఆత్మ అయిన ఆయుర్వేదాన్ని ప్రపంచ దేశాలకు పెద్ద ఎత్తున తీసుకెళ్తోంది. స్వదేశీ పారిశ్రామికోద్యమంలో ప్రధానమైన 'మేడ్ ఇన్ ఇండియా ను పతంజలి తమ కోర్ బిజినెస్ ప్రిన్సిపల్‌గా పాటిస్తోంది. ప్రపంచానికి ఆయుర్వేదాన్ని అందించిన భారత్ నుంచి ఆ బ్రాండ్ తెలిసేలా పతంజలి.. ఆయుర్వేద, సహజ ఉత్పత్తులైన సబ్బులు, నూనెలు, ఔషధాలు, ఇతర ఆహార పదార్థాలను ఇంటింటికీ చేరుస్తోంది. గడచిన 15 ఏళ్లలో పతంజలిని ప్రతి ఇంటిలో ఉపయోగించే పేరుగా మలిచి అసలైన అర్థం చెప్పింది.అంతేకాదు.. వందేళ్లకు పైగా భారత్ ఇండస్ట్రీకి చిరునామాగా నిలిచిన టాటా గ్రూప్, రిలయన్స్ జియో, అమూల్ డైయిరీ వంటివి కూడా భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పేరున్న ప్రొడక్టులు. బ్రాండ్ స్వదేశీ అన్నదాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఎక్కువుగా ప్రోత్సహిస్తున్నారు. ఎక్కువుగా స్వదేశీ ఉత్పత్తులు వాడమని ఆయన తరుచుగా చెబుతూనే ఉన్నారు. 2020 లోని ఓ ప్రసంగంలో స్వదేశీని ప్రచారం చేయడం అనేది మన మంత్రం కావాలి. మన ఉత్పత్తులను ఉపయోగించాలి.

అదే ఆత్మనిర్భర భారత్‌కు అసలైన పునాది '' అని ఆయన స్పష్టంగా చెప్పారు. రసాయన రహిత వ్యవసాయాన్ని చేపట్టాలని ఆయన తరచుగా చెబుతున్నారు. ఇది స్వావంలబంనలో ఓ భాగమన్నారు. ఈ నినాదం కేవలం ఆర్థిక బలోపేతానికి ఇచ్చింది మాత్రమే కాదు. సమాజిక, పర్యావరణ అంశాలను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రధాని ఆ పిలుపునిచ్చారు.ఇటీవల అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుంటే స్వదేశీ ఆవశ్యకత మనకు అర్థం అవుతుంది.

ఇది దిగుమతులపై పడుతున్న భారాన్ని తగ్గించడమే కాదు. మన స్థానిక రైతులు, కుటీర పరిశ్రమలు, కళాకారులకు చాలా ప్రోత్సాహాన్నిస్తుంది. స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించాలని ఇప్పటికే మొదలైన ఆలోచన మరింత బలోపేతం కావాలిసిన అవసరం ఉంది . స్వదేశీ ఉద్యమం కొనుగోలుకు సంబంధించిన నిర్ణయం మాత్రమే కాదు.. జాతి నిర్మాణానికి సంబంధించిన ఓ ముందడుగు. మేక్ ఇన్ ఇండియాతో, డిజిటలైజేషన్, సాంకేతిక పురోగతి అనేక రంగాలలో కూడా కనిపించింది. ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో స్వావలంబన పెరిగింది. మొబైల్ తయారీలో భారతదేశం అగ్ర దేశంగా మారింది. ఆపిల్, శాంసంగ్ సహా అనేక ఇతర ప్రపంచ కంపెనీలు భారతదేశంలో మొబైల్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. 2014లో, భారతదేశంలో కేవలం 2 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేసేవి. ఇది 2020 నాటికి 200 కంటే ఎక్కువ యూనిట్లకు పెరిగింది.మేక్ ఇన్ ఇండియా రక్షణ రంగంలో స్వావలంబనను ప్రోత్సహించింది. భారతీయ కంపెనీలు ఇప్పుడు సైనిక పరికరాలు, ఆయుధాల ఉత్పత్తికి పెద్ద ఎత్తున సహకరిస్తున్నాయి. రక్షణ రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రభుత్వం 74 శాతానికి పెంచింది. తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్' సహా అనేక స్వదేశీ రక్షణ పరికరాల ఉత్పత్తి ఈ చొరవలో ముఖ్యమైన భాగం.

మేక్ ఇన్ ఇండియా ఇతర ప్రధాన విజయాలు 2023-24లో రూ. 1.55 లక్షల కోట్ల విలువైన ఖాదీ విక్రయాలు పీఎల్ఐ పథకం కింద రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది 8.5 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించింది. 4 లక్షల కోట్లకు పైగా ఎగుమతులు పెరిగాయి. 2020లో టాయ్‌ల కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళికను అమలు చేసినప్పటి నుంచి ఎగుమతులు 239 శాతం పెరిగాయి.

## ఉప్పుతో ఆరోగ్యానికి ముప్పు

# తక్కువ తీసుకుంటే ఆరోగ్యం

- ఉప్పు అధికంగా తీసుకుంటే అనారోగ్యం - రుచి కోసం అధిక మోతాదులో ఉప్పును ఉపయోగిస్తూ రోగాల పాలు
- టిఫిన్ సెంటర్, కర్రీ పాయింట్, హెూటలలో మోతాదుకు మించిన ఉప్పు వినియోగం - అన్నంలో ఉప్పు వేసి వండితే త్వరగా రోగాలు వస్తాయి
- ఉప్పు అధికంగా తీసుకుంటే ముసలితనం త్వరగా వస్తుంది - ఉప్పుని చాలా తక్కువలో తీసుకోవడం ఆరోగ్యానికి మేలు
- "మన పెద్దలు ఉప్పుఇస్సాం అనేవారు అంటే ఉప్పు విషయము తో సమానం అని అర్థం, అందుకోసమే ఉప్పును చాలా చాలా తక్కువ మోతాదులో చెప్పగా తీసుకోవడమే ఆరోగ్యానికి చాలా మేలు"




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉప్పు ఎంత తక్కువ తీసుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది అన్న విషయాన్ని ప్రస్తుత మహిళలు, వంట మాస్టర్లు మరిచిపోయారు. రుచి రుచి అని ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు అధిక మొత్తంలో ఉప్పు తిని చిన్న వయసులోనే అనేక రోగాల పాలవుతున్నారు. ఉప్పు ఎంత తక్కువ తీసుకుంటే అంత మంచిది అన్న సంగతి పూర్తిగా మరచిపోయారు. ఇక హెూటల్ ల టిఫిన్ సెంటర్లో కర్రీ పాయింట్ లలో ఇష్టారాజ్యంగా ఉప్పును ఉపయోగిస్తూ డబ్బులు ఇచ్చి వినియోగదారుడు అనారోగ్యాన్ని కొనుక్కుంటున్నట్లుగా మారింది పరిస్థితి. ఉప్పును ఎక్కువగా తీసుకోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఉప్పులో సోడియం ఉంటుంది, ఇది శరీరంలో నీటిని నిలుపుకుంటుంది దీనివల్ల రక్తపోటు, వాపులు, గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు, ఒంటి నొప్పులు వస్తాయి. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల కలిగే ముప్పేంటంటే:

### ఉప్పు ఎక్కువైతే కలిగే ముప్పులు:

**రక్తపోటు:**
ఉప్పులో సోడియం ఉంటుంది, ఇది రక్తంలోకి ప్రవేశించి రక్తపోటును పెంచుతుంది.

**గుండె జబ్బులు:**
అధిక రక్తపోటు గుండె జబ్బులకు దారితీస్తుంది, కాబట్టి ఉప్పును పరిమితంగా తీసుకోవడం ముఖ్యం.

**కిడ్నీ సమస్యలు:**
ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు దెబ్బతింటుంది.

**శరీరంలో నీటిని నిలుపుకోవడం:**
ఉప్పు శరీరంలో నీటిని నిలుపుకుంటుంది, దీనివల్ల వాపు వస్తుంది.

**జీర్ణక్రియ సమస్యలు:**
అధిక ఉప్పు జీర్ణక్రియను దెబ్బతీస్తుంది.

### ఉప్పును తక్కువ తీసుకోవడం ఎలా.?

**ఉప్పును తగ్గించుకోవడం:**
ఆహారంలో ఉప్పును చాలా తగ్గించడం ద్వారా రక్తపోటును నియంత్రించవచ్చు మరియు ఇతర ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు.

**తక్కువ ఉప్పు ఉన్న ఆహారాలను ఎంచుకోవడం:**
తక్కువ సోడియం ఉన్న ఆహారాలను ఎంచుకోవడం ద్వారా శరీరంలో సోడియం స్థాయిని తగ్గించవచ్చు.

**ప్రోసెసర్డ్ ఫడ్లను తగ్గించడం:**
ప్రాసెసర్డ్ ఫడ్లలో అధికంగా ఉప్పు ఉంటుంది, కాబట్టి వాటిని తగ్గించడం మంచిది.

**ఉప్పును తక్కువగా వాడడం:**
హెూటల్ టిఫిన్ సెంటర్ కరేపాయింట్ల లలో ఉప్పును తక్కువగా వాడడం వల్ల శరీరంలో సోడియం స్థాయిని తగ్గించవచ్చు.

ముఖ్య గమనిక: ఉప్పును పూర్తిగా నివారించకూడదు, కానీ చాలా తక్కువ మోతాదులో తీసుకోవడం ఆరోగ్యానికి చాలా ముఖ్యం.

# నేటి కార్మిక ఐక్యత, కార్మిక ఉద్యమాలకు స్ఫూర్తి మే.డే



ప్రతి సంవత్సరం మే 1 వ తేదీన జరుపుకునే స్మారక దినమే మేడే. ఇది ప్రజా సెలవు దినం. చాలా దేశాలలో మే దినాన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా పిలుస్తారు. నాటి మేడే నేటి కార్మికుల పోరాటం, కార్మికుల ఐక్యతకు స్ఫూర్తి. పురాణగాథలు, ఇతిహాసాలు కొన్ని రోజులను పండుగలుగా, అలాగే కొన్ని జాతీయ సంఘటనలు సమాజానికి పర్వదినాలుగా మారాయి. కొందరు మహనీయులు తమ రక్తాన్ని చిందించి కొన్ని రోజులను చారిత్రాత్మక రోజులుగా మార్చారు. దీనిలో భాగమే మేడే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో కొందరు రక్తతర్పణం చేసి కేవలం తమ దేశంలో వుండే కార్మిక వర్గానికే కాకుండా ప్రపంచానికంతటికి కొత్త వెలుగును అందించారు. ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేము మనుషులమే, మా శక్తికి కూడా పరిమితులుంటాయి. ఈ చాకిరీ మేం చేయలేమని పని ముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడుచు చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం, కార్మికవర్గ పోరాట పటిమకు నిదర్శనం. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి, ఇంకా ఎనిమిది గంటలు రిక్రీయేషన్ అన్నవి ఈ పోరాటం ద్వారా సాధించుకున్న విజయాలు. ఇది పారిశ్రామిక యుగం ఏర్పడిన తర్వాత కలిగిన మార్పు. యాంత్రికయుగం రాకముందు మనిషి గంటలకొద్దీ పని చేసేవాడు. అదొక బానిస బతుకు. మనిషి తన విజ్ఞాన పరిశోధనల మూలంగా యంత్రాలను సృష్టించుకున్నాడు. యాంత్రిక యుగంలో క్యాపిటలిజం ఏవిధంగా పెరిగిందో అదే స్థాయిలో సామాజిక స్పృహ, చైతన్యం కూడా పెరిగాయి. అందువల్లనే పని గంటల పోరాటం వచ్చింది. కానీ భారతదేశంలో చికాగో కంటే ముందే, కలకత్తాలో కార్మికులు నిర్ణీత పని గంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మెచేశారు. అప్పటి వరకు రైల్వే కార్మికులు 10 గంటలు పని చేసేవారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలక వర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పనిచేస్తారో మేము కూడా అన్ని గంటలే పని చేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. కాబట్టి ఆ సంఘటన ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేకపోయింది 1923లో మొదటిసారి భారతదేశంలో 'మేడే'ను పాటించడం జరిగింది. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటి నుండే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటి నుండి 'మేడే'ను పాటించడం జరుగుతుంది. కానీ అసంఘటిత కార్మికవర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటు చేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పని చేస్తున్నారు. ఈనాడు మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి అక్కడి కంపనీలు కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతు వాళ్ళచే 10 నుండి 12 గంటలు పని చేయిస్తున్నారు. నేడు హైదరాబాద్ వంటి మహనగరాలలో విద్యావంతులైన యువత ఈనాడు శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రులు ఆడపిల్లలను భద్రత లేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంత వరకు శ్రమదోపిడీ, ఎక్కువ పని చేయించుకోవడం వంటివి సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఈనాడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలక వర్గాలు బహుళ జాతి కంపెనీలకు హామీలిస్తు దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటిత రంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలులో లేవు. నేడు విద్యావ్యవస్థలో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికంగా పని చేస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ రంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10 నుండి 12 గంటలు పని చేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమ దోపిడీ కూడా పెరుగుతుంది. గతంలో స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. విద్యార్థులను ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమై పోయాయి. ఉపాధ్యాయులు నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ప్రస్తుతం అమలుకు నోచుకోవడం లేదు.1886లో ఆరంభమైన ఈ ఉద్యమం వందేళ్ళ పండగ జరుపుకుంది. ప్రపంచంలో ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మేడే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైన పీడత వర్గాలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

**నేటి కార్మిక ఐక్యత, పోరాటాలకు స్ఫూర్తి మేడే విప్లవాభి వందనాలతో**



**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట్. రంగారెడ్డి**

# కలకలం రేపుతున్న సర్వే

**విజయవాడ :** ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 11 నెలలు అవుతోంది. ప్రభుత్వం పాలనతో పాటు సంక్షేమ పథకాలపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అయితే క్షేత్రస్థాయిలో కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు పలుమార్లు నేరుగా ఎమ్మెల్యేలకు హెచ్చరించారు. పనితీరు మార్చుకోవాలని సూచించారు. అయినా కొంతమంది ఎమ్మెల్యేల పనితీరులో మార్పు రావడం లేదు. తాజాగా విలువడిన ఓ సర్వే ఈ విషయాన్ని చెబుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈసారి కూటమి కచ్చితంగా ఘనవిజయం సాధిస్తుందని చెప్పిన సర్వే నిపుణుల్లో ప్రవీణ్ పుల్లట ఒకరు. ఆయన చెప్పిన అంచనాలు ఎన్నికల్లో దాదాపు నిజమయ్యాయి. దీంతో కూటమి ఘనవిజయం సాధించింది. అయితే ఇప్పుడు అదే ప్రవీణ్ పుల్లట కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల పనితీరుపై సంచలన ట్వీట్ చేశారుకూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చాలామంది పనితీరు ఆశాజనకంగా లేదని ఇప్పటికే పలుమార్లు ట్వీట్ల రూపంలో తన సర్వే అంశాలను వెల్లడించారు ప్రవీణ్ పుల్లట. అయితే తాజా గణాంకాల ప్రకారం ఈసారి 41 మంది కూటమి ఎమ్మెల్యేలకు మళ్లీ టిక్కెట్ రాదని.. వచ్చినా ఓడిపోతారని సోషల్ మీడియాలో సంచలన ట్వీట్ చేశారు. దీంతో ఇది రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకోనున్న తరుణంలో మరిన్ని సంచలన విషయాలు బయటపెడతానంటూ ప్రవీణ్ పుల్లట మరో ట్వీట్ చేశారు. 92 శాతం వన్ టైం ఎమ్మెల్యేలు మొదటిసారి.. చివరిసారి అంటూ మరో కామెంట్ కూడా పెట్టారు. అయితే ఇది ఎవరి గురించి అన్న విషయం మాత్రం చెప్పలేదు. అయితే ప్రవీణ్ పుల్లట త్వరలో మరిన్ని అంశాలు బయట పెడతారా? లేకుంటే హింట్స్ తో సరి పెడతారా? అన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.ఏపీలో కూటమిఅంతులేని మెజారిటీతో గెలిచింది. 164 అసెంబ్లీ సీట్లతో ఏకపక్ష విజయం సాధించింది. అయితే ప్రభుత్వం ప్రజల అంచనాలకు చేరుకోలేకపోతోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇంకా సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం, అటు పాలన సైతం సజావుగా సాగకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వం పై అసంతృప్తి ఉంది. కానీ ఏడాది పాలన కూడా పూర్తి కాకపోవడంతో అది వ్యతిరేకత కు టర్న్ కాలేదు. అయితే ఎన్నికలకు ముందు కూటమికి అనుకూలంగా ఉండే ప్రవీణ్ పుల్లట సర్వే.. ఇప్పుడు వ్యతిరేకంగా మారడం మాత్రం మూడు పార్టీల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదన్న విమర్శలు వస్తున్న తరుణంలో సీఎం చంద్రబాబు కఠిన చర్యలకు ఉపక్రమించాలన్న డిమాండ్ వినిపిస్తోంది2024 ఎన్నికల్లో చాలామంది కొత్తవారికి అవకాశం ఇచ్చారు. దాదాపు 80 నుంచి 100 మంది కొత్తగా ఎన్నికైన వారే. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశం నిర్వహించారు చంద్రబాబు. ప్రజలు బాధ్యతతో ఈ విజయాన్ని కట్టబెట్టారని.. దీనిని నిలుపుకోవాల్సిన అవసరం ఉందని కూడా చెప్పుకొచ్చారు. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఎమ్మెల్యే పై ఉందని తేల్చి చెప్పారు. అటు తర్వాత కూడా వర్క్ షాపులు నిర్వహించి మరి చాలా అంశాలపై గట్టిగానే హెచ్చరికలు పంపారు. అయినా సరే కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహార శైలిలో మార్పు రావడం లేదు. మరి ఈ సర్వే తోనైనా జాగ్రత్త పడతారా? లేదా? అన్నది తెలియాలి.

## సామాజిక పెన్షన్లలో భారీగా అక్రమాలు

**వియవాడ :** ఏపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సామాజిక పెన్షన్లలో భారీగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వేల సంఖ్యలో అనర్హులను గుర్తిస్తున్నారు. వికలాంగుల పెన్షన్లలో ఇప్పటి వరకు 65వేల మంది అనర్హులను గుర్తించారు. పెన్షన్ల తనిఖీ పూర్తయ్యేనాటికి ఈ సంఖ్య మరింత పెరుగనుంది.ఏపీలో సామాజిక పెన్షన్ల తనిఖీలో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అనర్హులకు పెన్షన్లు చెల్లిస్తున్నారని ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ఏపీ ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ల తనిఖీ చేపట్టింది. వికలాంగులకు రూ.6 వేల నుంచి రూ.15వేల వరకు పెన్షన్లు చెల్లిస్తుండటంతో పెద్ద ఎత్తున అనర్హులు వాటిని దక్కించుకుంటున్నారు.ఏపీప్రభుత్వం అందిస్తోన్న సామాజిక పెన్షన్లను తప్పుడు ధృవీకరణ పత్రాలతో పొందుతున్నవారి డొంక కదులుతోంది. గత మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సామాజిక పెన్షన్లను వైద్య బృందాలతో తనిఖీ చేయిస్తోంది. ఈ క్రమంలో బోగస్ సర్టిఫికెట్లతో పెన్షన్లు పొందుతున్న వారిని పెద్ద సంఖ్యలో గుర్తించారు.ఏపీలో నెలకు రూ.6 వేలు నుంచి రూ.15వేల వరకు సామాజిక పెన్షన్లను చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో తొలిదశలో రూ.15వేల పెన్షన్లు పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించి వాటిని తొలగించారు.రెండో దశలో మార్చి నుంచి రూ.6 వేల పెన్షన్ పొందుతున్న వారికి క్షేత్ర స్థాయి పరీక్షలు నిర్వహించిన అనర్హులను తొల గిస్తున్నారు. శారీరక వైకల్యంలో భాగంగా అయిదు విభా?గాల్లో ప్రతి నెల 8లక్షల మందికి రూ.6 వేల పెన్షన్ చెల్లిస్తున్నారు.ఈ ఏడాది ఫిబ్ర వరి నుంచి ఆరోగ్య శాఖ, సెర్ప్ అధికారుల బృందాలు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. లబ్దిదారులను ఎంపిక చేసిన ఆసుపత్రులలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది.మొత్తం పెన్షనర్లలో 4లక్షల మంది ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న వారున్నారు. మిగిలిన వారిలో ఈఎన్టీ, కంటి చూపు లోపం, మానసిక వైకల్యం ఇతర సమస్యలున్న వారున్నారు.ఇప్పటి వరకు 3 లక్షల మందికి వైద్య పరీక్షలు పూర్తి చేయగా వారిలో సుమారు 65 వేల మంది అనర్హులను గుర్తించారు. పది వేల మందికి వైకల్యం ఉన్నా.. పెన్షన్ పొందే స్థాయిలో శారీరక వైకల్యం లేదు.శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలో అనర్హులుఅధికంగా ఉన్నట్లు గుర్తించారు. నెల్లూరు, అనంత పురం, కర్నూలు, తిరు పతి జిల్లాల్లో అనర్హులు పట్టుబడుతున్నారు.అంగవైకల్యం, మానసిక, ఈఎన్టీ సమస్యలున్న వారికి నవంబర్ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. నెలకు రూ.15 వేల పెన్షన్ పొందే 24,091 మందిలో 7,256 మంది అనర్హులలను గతంలోనే గుర్తించారు. మిగిలిన 70% లో 31.29% మంది రూ.6వేల పెన్షన్‌కు మాత్రమే అర్హత ఉంది.తక్కువ వైకల్యం ఉన్న వారికి 40శాతానికి పైగా వైకల్యంగా నమోదు చేయడంతో వారికి రూ.6వేల పెన్షన్ లభిస్తోంది.

## అంతు చిక్కని
# కమల వ్యూహం

**ఏలూరు :** ఇతర రాష్ట్రాలతో పోలిస్తే భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ లో కొత్త పంథాను ఎంచుకుంది. మిగిలిన రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. అంతే కాదు వారికి పదవులను కేటాయించడంలోనూ ముందుంటున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ లోమాత్రం పూర్తి భిన్నంగా నిర్ణయాలు తీసుకుంటుంది. గత కొన్నేళ్ల నుంచి బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో తీసుకున్న నిర్ణయాలను పరిశీలిస్తే పట్టు బిగించుకోవడానికి, పార్టీ బలోపేతానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అంతే కాకుండా పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరగదని బలమైన సంకేతాలను కూడా పార్టీ కేంద్ర నాయకత్వం క్యాడర్ లోకి పంపే ప్రయత్నం చేస్తుంది. సీనియర్ నేతలను కూడా పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులను కట్టబెడుతుండటం చర్చనీయాంశమైంది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణను తీసుకుంటే అక్కడ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు ఇచ్చారు. డీకే అరుణ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసి వచ్చినప్పటికీ ఆమెకు పార్టీ ఉపాధ్యక్షురాలిగా నియమించడమే కాకుండా తర్వాత పార్లమెంటు టిక్కెట్ కూడా ఇచ్చారు. అలాగే కొండా విశ్వేశ్వర్ రెడ్డికి కూడా ఎంపీ సీటును కేటాయించారు.

అదే మాదిరిగా టీఆర్ఎస్ లో సుదీర్ఘకాలం ఉండి వచ్చిన ఈటల రాజేందర్ కు కూడా ప్రాధాన్యత ఇస్తూ పార్లమెంటుకు ఎన్నికయ్యేలా చర్యలు తీసుకుంది. కాకపోతే తెలంగాణలోనూ కేంద్ర మంత్రి పదవులు మాత్రం పార్టీని నమ్ముకున్న వారికే ఇచ్చింది. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు తొలి నుంచి బీజేపీలో కిందిస్థాయి నుంచి పనిచేసి వచ్చిన వారికి అవకాశం కల్పించింది. రాజ్యసభ స్థానం కూడా సుదీర్ఘకాలం పార్టీ కోసం పనిచేసిన లక్ష్మణ్ కు ఇచ్చింది. తమిళనాడులో కూడా అన్నాడీఎంకే నుంచి వచ్చిన నేతకు పార్టీ పగ్గాలు అప్పగించింది. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన పురంద్రీశ్వరికి, కన్నా లక్ష్మీనారాయణకు పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. ఇక మంత్రి పదవుల విషయానికి వచ్చే సరికి పార్టీలో కొత్తగా చేరిన వారికి కాకుండా బీజేపీ సిద్ధాంతాలను నమ్మిన వారికి అందలం ఎక్కించారు. రాష్ట్ర మంత్రిగా సత్యకుమార్ యాదవ్ ను ఎంపిక చేశారు. అలాగే కేంద్ర మంత్రి పదవి కూడా నరసాపురం నుంచి తొలి సారి ఎన్నికైన భూపతి రాజు శ్రీనివాసవర్మను ఎంపిక చేశారు.

ఈ నిర్ణయాలన్నీ పార్టీ క్యాడర్ లో ఉత్సాహం నింపగా కూటమి లోని మిత్ర పక్షాలే ఒకింత ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న... తాజాగా విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానంలో జరుగుతున్న ఉప ఎన్నికకు సంబంధించి కూడా ఎవరికీ తెలియని పేరున్న నేతను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుడిగా నేడు బీజేపీకి చెందిన పాక వెంకట సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. భీమవరానికి చెందిన పాక వెంకట సత్యనారాయణను అనూహ్యంగా బీజేపీ ఎంపిక చేసింది. పాక వెంకట సత్యనారాయణ బీజేపీ క్రమశిక్షణ సంఘం కమిటీ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. ఆయనను ఎంపిక చేయడంతో బీజేపీలో సుదీర్ఘకాలంగా పనిచేసిన వారికి పదవులు ఇస్తున్నట్లయింది. పాక వెంకట సత్యానారాయణ ఎంపిక తో బీజేపీ స్ట్రాటజీఏందో అర్థమవుతుంది. బీజేపీ చాలా ముందు చూపుతో ఇలా వ్యవహరిస్తుందన్న కామెంట్స్ బలంగా వినిపిస్తున్నాయి.

# సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశ్రుతి

**– గోడకూలి**
**ఎనిమిది మంది భక్తులు మృతి**











**సింహాచలం:** విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఎనిమిది మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. దీంతో శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆరు మృతదేహాలను విశాఖ కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. మరో రెండు మృతదేహాలను శిథిలాల కింద గుర్తించారు.

# టార్గెట్ గొట్టిపాటి..

**ఒంగోలు :** వైయస్సార్ కాంగ్రెస్ అధినేత ప్రకాశం జిల్లాపై దృష్టి పెట్టారు. ప్రధానంగా అద్దంకి నియోజకవర్గం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. అక్కడ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హవాకు బ్రేక్ వేయాలని చూస్తున్నారు. సమర్థుడైన నాయకుడిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా తేవాలని చూస్తున్నారు. 2029 ఎన్నికల్లో గొట్టిపాటి రవికుమార్ ను ఓడించే నేతను తేవాలన్నది జగన్మోహన్ రెడ్డి ప్లాన్. ఈ క్రమంలో సీనియర్ నేత కరణం బలరామకృష్ణమూర్తి సేవలను వినియోగించుకోవాలని చూస్తున్నారు. ఎలాగైనా 2029లో అసెంబ్లీలో గొట్టిపాటి రవికుమార్ అడుగుపెట్టకూడదు అన్నది జగన్మోహన్ రెడ్డి ప్లాన్.అద్దంకి అంటే ముందుగా గుర్తుకొచ్చేది కరణం బలరాం. ఆ నియోజకవర్గంలో తనకంటూ ఒక ముద్ర చాటుకుంటూ వచ్చారు. కానీ గొట్టిపాటి రవికుమార్ కు బ్రేక్ వేయలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన రవికుమార్ వరుసగా ఐదు సార్లు గెలుస్తూ వచ్చారు. అద్దంకిలో అయితే నాలుగు సార్లు వరుస విజయంతో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. రెండున్నర దశాబ్దాలుగా అక్కడ రాజకీయాలను శాసిస్తున్నారు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొరకరాని కొయ్యగా మారిపోయారు. అందుకే రవికుమార్ హవాకు బ్రేక్ వేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి.2004లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు గొట్టిపాటి రవికుమార్ తొలిసారిగా మార్టూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2009 పునర్విభజనతో మార్టూరు అద్దంకిగా మారింది. దీంతో గొట్టిపాటి రవికుమార్ అద్దంకికి మారాల్సి వచ్చింది. ఆ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కరణం బలరాం పై పోటీ చేసి గెలిచారు రవికుమార్. 2014 ఎన్నికల నాటికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు రవి కుమార్. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. తర్వాత తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా మూడోసారి అద్దంకి నుంచి పోటీ చేసి గెలిచారు. ఎన్ని రకాల ఇబ్బందులు ఎదురైనా తెలుగుదేశం పార్టీలో కొనసాగారు. 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మంత్రిగా ఎన్నికయ్యారు.2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా హనీమిరెడ్డినిబరిలో దించారు జగన్మోహన్ రెడ్డి. ఈయన వైవి సుబ్బారెడ్డి కి సన్నిహితుడు. అయితే ఓటమి తర్వాత హనీమిరెడ్డి నియోజకవర్గంలో కనిపించడం లేదు. దీంతో ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే నాయకుడు లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు సమర్థవంతుడైన నేత కోసం జగన్మోహన్ రెడ్డి అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలోనే కరణం బలరామకృష్ణకు కబురు చేశారు. అద్దంకి నియోజకవర్గ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. మొన్నటి ఎన్నికల్లో చీరాల నుంచి కరణం బలరాం కుమారుడు వెంకటేష్ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే కరణం బలరాం టిడిపిలోకి వెళ్ళిపోతారని ప్రచారం జరుగుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే జగన్మోహన్ రెడ్డి పిలిచి బలరాం తో మాట్లాడినట్లు తెలుస్తోంది. త్వరలో అద్దంకి బాధ్యతలు బలరామకృష్ణకు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## సింహాచలం దుర్ఘటన దురదృష్టకరం

**అమరావతి** సింహాచలంలో గోడ కూలడం మూలంగా క్యూ లైన్ లో ఉన్న ఎనిమిది మంది భక్తులు మృతి చెందారని తెలిసి తీవ్రగ్భ్రాంతికి లోనయ్యానని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. చందనోత్సవ సమయాన ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. విశాఖపట్నం జిల్లా అధికారుల నుంచి ఈ ఘటన వివరాలు తెలుసుకున్నాను. భారీ వర్షాల మూలంగా గోడ కూలిందని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించానని వెల్లడించారు.

## ఘటన కలచివేసింది

**అమరావతి** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడం నన్ను కలచివేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భారీ వర్షాల కారణంగా గోడ కూలడంతో జరిగిన ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. అక్కడి పరిస్థితిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడాను.గాయపడిన వారికి చికిత్స అందించాలని ఆదేశించాను. ఎప్పటికప్పుడు పరిస్థిని సమీక్షిస్తున్నాని అన్నారు.

## ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ లతో సహాయక చర్యలు

**విశాఖపట్నం** హోంమంత్రి అనిత సింహాచలంలో గోడకూలిన ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గోడకూలిన ప్రాంతంలో సహాయక చర్యలను పర్యవేక్షించారు. సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్ పై సిమెంట్ గోడ కూలింది. ఎన్టీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ నేతృత్వంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సింహాచలం రూ.300 క్యూలైన్లో జరిగిన గోడ కూలిన దుర్ఘటన వద్ద ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్., ఫైర్, పోలీస్ శాఖ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలను హోంమంత్రి అనిత,జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

## మరిన్ని ఉగ్రదాడులు..

**– అప్రమత్తమైన ఇంటెలిజెన్స్**

**శ్రీనగర్ :** జమ్మూ కాశ్మీర్లో మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు కేంద్రాన్ని హెచ్చరించాయి. దాంతో అప్రమత్తమైన ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్లోని సగానికి పైగా పర్యాటక స్థలాలను మూసివేసింది. మరికొన్ని పర్యాటక స్థలాల వద్ద భద్రత పెంచింది. కాశ్మీర్ వ్యాప్తంగా 87 టూరిస్టు కేంద్రాలు ఉండగా 48 నుంచి 50 వరకు పర్యాటక స్థలాలను మూసివేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. సోన్ మార్గ్, దాల్ లేక్, గుల్మార్గ్, బైసారన్ లోయ సహా సున్నితమైన పర్యాటక కేంద్రాలలో ప్రత్యేక భద్రత దళాలు ఏర్పాటు చేశారు.పర్యాటకులు ప్రవేశించడానికి అనుమతించని టూరిస్ట్ ప్రదేశాలలో గురేజ్ లోయ, దూద్‌పత్రి ఉన్నాయి. గత వారం 'మినీ స్విట్జర్లాండ్'గా పిలుచుకునే బైసరన్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేయగా 26 మంది ప్రాణాలు కోల్పోయారు. 2019 పుల్వామా దాడి తర్వాత కాశ్మీర్ లోయలో అతిపెద్ద దాడి ఇది. పర్యాటకులకు ముప్పు ఉందని, మరో ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందని భావించి కాశ్మీర్‌లోని 87 పబ్లిక్ పార్కులు, ప్రదేశాలలో 48 చోట్ల గేట్లు మూసివేశారు. భద్రతా సమీక్ష కొనసాగుతోందని, రాబోయే రోజుల్లో జాబితాలో మరిన్ని ప్రదేశాలను మూసివేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారని తెలిపింది.మూసివేసిన పర్యాటక ప్రదేశాలు కాశ్మీర్‌లోని సుదూర ప్రాంతాలలో ఉన్నాయని, గత పదేళ్లలో తెరుచుకున్న కొత్త టూరిస్ట్ స్పాట్స్ కూడా మూసివేసినట్లు అధికారులు తెలిపారు. పర్యాటకులు సందర్శించలేని ప్రదేశాలలో కోకెర్నాగ్, దుక్సుమ్, మార్గన్ టాప్, సింథాన్ టాప్, అచ్చబల్, బాంగస్ లోయ, తోసామైదాన్ ఉన్నాయి.ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఉగ్రదాడికి సంబంధించి రోజుకో వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## సింహాచలం చందనోత్సవంలో భక్తుల మృతిపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌గ్భ్రాంతి

**తాడేపల్లి** విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో గోడ కుప్పకూలి భక్తులు మృతి చెందడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. చందనోత్సవం సందర్భంగా రూ. 300 టికెట్ క్యూలైన్ పై గోడ కుప్పకూలి భక్తులు మృత్యువాత పడటంపై తీవ్రవిచారం వ్యక్తం చేశారు. స్వామివారి నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులు ఇటువంటి దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, మరణించిన భక్తుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## బాధిత కుటుంబాలకు అండగా వుంటాం

**తాడేపల్లి** సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద జరిగిన దుర్ఘటన నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని మంత్రి నారా లోకేష్ అన్నారు. . ఈ ఘటనలో గాయపడిన వారికి విశాఖ కేజీ హెచ్ ఆసుపత్రిలో చికిత్స జరుగుతోంది. బాధితులకు మెరుగైన చికిత్స కోసం అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సిందిగా యంత్రాంగాన్ని ఆదేశించాం. పోలీసులు, ఎస్డీఆర్ ఎఫ్ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయి. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు..

## ఆయుర్వేదంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

**హైదరాబాద్ :** భారత హెల్త్ కేర్ రంగం అద్భుతమైన పురోగతి సాధిస్తోంది. ఆధునిక సాంకేతికకు మూలికా, ఆయుర్వేద నివారణలను మిళితం చేయడం చేయడం ద్వారా మెరుగైన చికిత్స అందించడానికి, సంప్రదాయ, ఆయుర్వేదంతో కొత్త మందులు అందించడానికి అవకాశం ఏర్పడుతోదం?. భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తు వేగంగా అభివృద్ధి చెందుతోంది. వ్యాధి నిర్ధారణ, నివారణ, ఆవిష్కరణ, పరిశోధన ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. పతంజలి రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, డాబర్ ఇండియా లిమిటెడ్ తో పాటు సన్ హెర్బల్స్ వంటి దేశంలోని అనేక కంపెనీలు, సంస్థలు ఆయుర్వేద మందుల కోసం క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ మందుల తయారీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ , డిజిటల్ హెల్త్ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు గ్రామీణ , పట్టణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సేవలకు అవకాశాలను పెంచాయి.భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తు ఆవిష్కరణ , పరిశోధన ద్వారా వేగంగా మారుతోంది. దేశంలోని టెలిమెడిసిన్ , ఇ-సంజీవని వంటి వేదికలు మారుమూల రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాయి. వారి ఆరోగ్యాలను కాపాడుతున్నాయి. సాంకేతిక అభివృద్ధి, కృత్రిమ మేధస్సు, బయోటెక్నాలజీ , డిజిటల్ ఆరోగ్య పరిష్కారాల ద్వారా, దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ సామాన్య ప్రజలకూ అందుబాటులోకి వస్తోంది. తక్కువ ధరల్లోనే ప్రభావవంతమైన వైద్యం అందుతోందది. క్షయ, ఊపిరితిత్తుల వ్యాధులను ముందస్తుగా గుర్తించడానికి అనుమతించే ఎక్స్-రేలు , సీటీ స్కాన్‌లను విశ్లేషించడానికి ఏఐ ని ఉపయోగిస్తున్నారు. టెలిమెడిసిన్‌లో ప్రాక్టో , 1ఎంజి వంటి ప్లాట్‌ఫామ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో కూడా మంచి వైద్యులను సంప్రదించగలిగేలా చేస్తున్నాయి. పతంజలి పరిశోధనా సంస్థ (ఖఖీఎ)లోని 500 మందికి పైగా శాస్త్రవేత్తలు ఆయుర్వేదాన్ని ఆధునిక వైద్య శాస్త్రంతో కలిపి పరిశోధనలు చేస్తున్నారు. ఔషధాలను అభివృద్ధి చేస్తున్నారని కంపెనీ చెబుతోంది. పతంజలి టెలిమెడిసిన్ చొరవ , మూలికా ఉత్పత్తులు భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకు, అ ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తీసుకెళ్తున్నాయని పతంజలి తెలిపింది. పర్యావరణ అనుకూల ఉత్పత్తులు , సేంద్రీయ వ్యవసాయం ఇప్పుడు దేశంలో ట్రెండ్‌గా మారింది. "మా పరిశోధన పెట్టుబడి ఆయుర్వేదాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. పతంజలి చేసిన ఈ ప్రయత్నం ఆరోగ్య సంరక్షణ సేవల ను మరింత అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా, ప్రపంచ వేదికపై భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రముఖంగా నిలబెడుతోంది." అని పతంజలి తెలిపింది.

## అప్పన్న సన్నిధిలో విషాదం..

**– ఇబ్బంది లేకుండా దర్శనం**

**విశాఖపట్నం** సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశృతి చోటుచేసున్న విషమయం తెలిసిందే. భారీ వర్షానికి రూ.300 క్యూలైన్ దగ్గర గోడ కూలి 8 మంది భక్తులు మృతి చెందారు. ఈ ఘటనపై స్పందించిన హోం మంత్రి అనిత, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోకి రావడంతో భక్తులు స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. అధికారులు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

## మద్యం మత్తులో
# కారు డ్రైవర్ హల్ చల్

**రంగారెడ్డి** పెద్ద అంబర్ పేట్ ఔటర్ రింగురోడ్డు వద్ద కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో డివైడర్ పై నుండి వచ్చి ఎదురుగా వస్తున్న వాహనాలను కారు డ్రైవర్ ఢీ కొట్టాడు. ఒక్క కారు, రెండు బైకులను ఢీ కొట్టింది. ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. వారిని హాస్పిటల్ కు తరలించారు. కారు లో మద్యం బాటిల్స్ లభ్యం అయ్యాయి. జాతీయ రహదారి పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది..

## చర్లపల్లిలో బీజేపీ ధర్నా

**మేడ్చల్** మేడ్చల్ జిల్లా చర్లపల్లి రైల్వే టర్మినల్ లో మౌలిక వసతులు కల్పించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి, రోడ్ల విస్తరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈరోజు చర్లపల్లి రైల్వే టర్మినల్ ముందు బీజేపీ ఆధ్వర్యంలో బైటాయించి ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, భారత ప్రభుత్వం 450కోట్లతో చర్లపల్లి టర్మినల్ నిర్మించి వర్చువల్ గా నాలుగు నెలలక్రితమే మోదీ చేతుల మీదుగా ప్రారంభించినా ఇంత వరకు రాష్ట్రప్రభుత్వం ప్రయాణికులకు కనీస వసతులు కల్పించక పోవడం సిగ్గు చేటు అన్నారు.రోడ్లు, వీధి లైట్లు, బస్సు సౌకర్యం కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులకు గురివుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. 15రోజుల్లో ప్రజలకు కావాలసిన వసతులు కల్పించక పోతే రాష్ట ప్రభుత్వాన్ని అష్ట దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు.

## 2024-25 పదో తరగతి ఫలితాలలో

# కృష్ణవేణి హై స్కూల్ విజయ కేతనం.







మంథని ( ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలోని కాకతీయ హైస్కూల్లో ఈ రోజు ప్రకటించిన పదవతరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత తో పాటు జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన మా విద్యార్థి కటకం లక్ష్మి సూర్య. భరత్ 576/600 (10/10. జిపిఏ ఇ. ధనుష్, 572/600(10/10. జిపిఏ %+%. చైత్.565/600(,10/10. జిపిఏ ఈ పాఠశాల%శ్రీశీ% చదివిన విద్యార్థిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## పదవ తరగతి ఫలితాల్లో

# మంథని కాకతీయ ప్రభంజనం.



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని లోని కాకతీయ హై స్కూల్ లో గత మార్చి నెలలో జరిగిన పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాలను నేడు విడుదల చేశారు. పాఠశాలలో మొత్తము 42 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. హాజరైన విద్యార్థులలో 100% ఫలితాలు సాధించారు. ఈ ఫలితాలలో దుర్గం త్రేక్ష600 మార్కులకు గాను 579 మార్కులు సాధించి మండలంలోని టాపర్గా నిలిచింది. అదేవిధంగా పాఠశాలలో భాసాని సిరి వర్షిని 567 మార్కు సాధించి పాఠశాలలో రెండవ ర్యాంకు సాధించింది. అదేవిధంగా పాఠశాల ఫలితాల్లో 500 కు పైగా 22 మంది విద్యార్థులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన దుర్గం తెక్ష మరియు భాసాని శ్రీ వర్షిని పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి అభినందించారు. గతంలో చెప్పినట్లుగా గత నాలుగు సంవత్సరాల నుంచి మంథని మండలంలో కాకతీయ పాఠశాల టాపర్గా నిలుస్తూ ఉంది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను పోషకులను సహకరించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి మరియు డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి. శ్రావణ్ రెడ్డి. స్రవంతి మరియు పావనీలు అభినందించారు.

# ఎల్.ఓ.సీ.బాధితులకు ఒక ఆర్థిక భరోసా

**- వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**

**- రూ.6 లక్షలు విలువగల ప్రొసీడింగ్ కాపీ అందజేత**

**- ఆది శ్రీనివాస్ కు బాధిత కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామానికి చెందిన అమిరెడ్డి మునెమ్మ అనారోగ్యంతో అత్యవసర చికిత్స నిమిత్తం ఎల్.ఓ.సి.మంజూరుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు మునెమ్మ కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేయగా తక్షణమే స్పందించి హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రత్యేక చికిత్స అందించాలని ఆదేశిస్తూ, ప్రభుత్వం పక్షాన రూ.6 లక్షల విలువగల ఎల్.ఓ.సి. ప్రొసీడింగ్ కాపీని బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్.ఓ.సి.బాధిత కుటుంబాలకు ఒక ఆర్థిక భరోసా అని, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేసి, ఎమ్మెల్యే,విప్ ఆది శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నూతన గృహప్రవేశ వేడుకలో... చల్మెడ హాజరు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం,రుద్రంగి మండల కేంద్రానికి చెందిన పాత్రికేయులు కాసోజి గణేష్ నూతన గృహప్రవేశ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై గణేష్ దంపతులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయనతో పాటుగా మాజీ ఎంపీపీ గంగం స్వరూప- మహేష్,సెస్ డైరెక్టర్ గంగారాం, గ్రామశాఖ అధ్యక్షుడు కమలాకర్, నాయకులు మంచే రాజేశం, గెంటే ప్రశాంత్, తలారి నర్సయ్య, పుదరి శ్రీనివాస్, నాగులపెల్లి రవి, మనిదీపు, రాజేందర్, లక్ష్మణ్, చారి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల కార్మికులందరికీ

# "మేడే" శుభాకాంక్షలు

**- బూరుగుపల్లి గ్రామ హమాలీ సంఘం అధ్యక్షులు : సురుగు నాంపల్లి**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామ హమాలీ సంఘం అధ్యక్షులు సురుగు నాంపల్లి మే 1, మేడే సందర్భంగా మండల హమాలీ కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమైందని గుర్తుచేశారు.ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకొని,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. నేడు హమాలీలు ఎదుర్కొంటున్న తక్కువ వేతనాలు, సురక్షితమైన పనితీరు కొరత, ఉద్యోగ భద్రత వంటి సమస్యలను ప్రభుత్వం గమనించి చట్టబద్ధమైన పరిష్కారాలు తీసుకురావాలని కోరారు.కార్మికుల సంక్షేమమే సమాజ అభివృద్ధికి బాటపెట్టే మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని నాంపల్లి పిలుపునిచ్చారు.

## ఉపాధి కూలీల వేతనాలలో

# కోత విధిస్తే సహించేది లేదు.

**బూడిద గణేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి.**



మంథని ( ప్రశ్న న్యూస్) ముత్తారం మండలం హరిపురం గ్రామంలో జరుగుచున్న ఉపాధ హామీ పని ప్రదేశాలను సందర్శించి కూలీల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బూడిద గణేష్ మాట్లాడుతూ.ఉపాది కూలీలు అడవిలోని గుట్టపైన బండరాళ్ల మధ్యన పనిచేస్తున్నారని అధికారులు పెట్టే కొలతల ప్రకారం కూలీలు పనిచేయలేకపోతున్నారని కూలి గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మండల స్థాయి ఉపాధి హామీ అధికారులు కూలీల వేతనాలలో కోతల విధిస్తున్నారని శ్రమను నమ్ముకొని రెక్కలను ముక్కలుగా చేసి ఎర్రటి ఎండలో బండరాల మధ్య శ్రమిస్తున్న కష్టజీవుల వేతనాలలో కోత విధిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే చెరువులలో పూడికతీత పనులను చేపట్టాలని కూలీలకు రోజువారి వేతనం 600 రూపాయలు ఇచ్చి పని దినాలు 200 రోజులు పెంచి కొలతలను తగ్గించి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లిఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు కుమార్ తో పాటు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## కురుమ సామాజిక వర్గం సంక్షేమాభివృద్ధికి ఎమ్మెల్యే సత్యం చేస్తున్న కృషి అభినందనీయం

**- కురుమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లాధ్యక్షులు : ఏనుగుల కనుకయ్య**

**- కురుమ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ-ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు**



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మల్లాపూర్ అమ్లెట్ గ్రామమైన రేగులపల్లి గ్రామంలో కురుమ సంఘం నూతన భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మంజూరు చేసిన రూ.5 లక్షల నిధులతో ఈ నిర్మాణం చేపడుతున్నారు.ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు ఏనుగుల కనుకయ్య ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలియజేశారు. కురుమ సామాజిక వర్గం సంక్షేమాభివృద్ధికి ఎమ్మెల్యే సత్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భూమిపూజ కార్యక్రమంలో బోయినిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం, కురుమ సంఘం రేగులపల్లి గ్రామ అధ్యక్షులు పోచమల్లు, తదితర కురుమ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాబాయ్ హెూటల్‌లో ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కొత్తగూడెం పట్టణంలోని బాబాయ్ హెూటల్‌లో ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెూటళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా అనే విషయాలను పరిశీలించారు. హెూటల్ పై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేసినట్టు సమాచారం. హెూటల్ లో వాడుతున్న ముడి సరుకులను తనిఖీ చేసి హెూటల్‌లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### లక్షల్లో వ్యాపారం లైసెన్స్ మాత్రం లేదు

ఎన్నాళ్ళ నుంచో రైతు బజార్ ప్రాంతంలో ఎప్పటినుండో ఉన్న బాబాయ్ హెూటల్ రోజుకు సుమారుగా 20 వేలు చొప్పున నెలకు లక్షల్లో వ్యాపారం చేస్తున్నప్పటికి ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకపోవడంతో పాటుగా బహిరంగంగా రోడ్డుపైనే వంటలు చేయడం గురించి మున్సిపల్ అధికారులు, జిల్లా కలెక్టర్ సహా రాష్ట్ర అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు చేపట్టినట్టు సమాచారం...

## శంకుస్థాపన ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి



ధర్పల్లి (ప్రశ్న న్యూస్)రైతులు వరి పంటను అధికంగా పండిస్తారు అని సన్నబడ్డ రైతులకు 500 రూపాయలు బోనస్ ఇస్తూ నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం అని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం మోబిన్ సాబ్బాయ్ తండా,గోవింద్ పల్లి,బెల్య తండా, మద్రాయి తండా,ధర్పల్లి, ఎస్ బి తండా, దమ్మన్నపేట్ గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన,ప్రారంభోత్సవాలు చేసిన రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని గ్రామాలకు అన్నీ పనులను చేస్తానని హామీ ఇచ్చాను. మాట ఇస్తే తప్పమని ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తామని ఆయన అన్నారు.కొన్ని పార్టీలు అనవసరంగా రాద్ధాంతం చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలన చేసి తెలంగాణను అప్పుల తెలంగాణ చేశారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కాబట్టి ప్రభుత్వంకు సపోర్ట్ చేస్తూ మన రాష్ట్ర అభివృద్ధికి తోడుపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ధర్పల్లి సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి, సొసైటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ యువజన నాయకుడు నరేష్, జిల్లా అధికార ప్రతి నిధి చెలి మేళా నర్సయ్య, జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగ్యా నాయక్, కాంగ్రెస్ గ్రామా శాఖ లా అధ్యక్షులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి నూతన చట్టం తో

# భూ సమస్యలు పరిష్కారం

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**- ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో పాల్గొన్న కలెక్టర్**



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) భూ భారతి నూతన చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలియజేశారు. భూ భారతి, నూతన ఆర్ఓఆర్ చట్టంపై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో, అలాగే వీర్నపల్లిలో నిర్వహించిన సదస్సులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై చట్టంలోని వివిధ అంశాలను, ప్రయోజనాలను ప్రెజెంటేషన్ ద్వారా రైతులు, ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు - భూ భారతి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిందని తెలిపారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, భూముల మ్యాప్ జియో ట్యాగింగ్ తో పాస్ బుక్కులు జారీ చేస్తామని వివరించారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారని, భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేస్తారని వివరించారు, పాసు పుస్తకాలలో భూమి పటం ఉంటుందని స్పష్టం చేశారు. భూ సమస్యల పరిస్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, రిజిస్ట్రేషన్ అనంతరం భూధార్ కార్డుల జారీ చేస్తుందని తెలిపారు.ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు ఉంటుందని వివరించారు. మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వం, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వర్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రణాళికతో భూ భారత చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తారని వివరించారు. గ్రామ రెవిన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని తెలిపారు.ఎల్లారెడ్డిపేటలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సాబెరా బేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, తహసీల్దార్లు సుజాత, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. వీర్నపల్లిలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, ఇంచార్జి తహశీల్దార్ ముక్తార్ పాషా, ఇంచార్జి ఎంపిడీవో అబ్దుల్ వాజీద్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి 4 నెలలకు ఒక కమిషనర్..

**- ఇదేం పాలనా... గ్రేటర్ హస్తవ్యస్తం**

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్?.దేశంలోనే పెద్ద కార్పొరేషన్లలో ఒకటి. వేలాది కోట్ల రూపాయల బడ్జెట్. కోటి మందికి పైగా జనాభా. అలాంటి కార్పొరేషన్ లో పథకాలు అమలు చేయాలన్నా?ప్రాజెక్టులు టేకప్ చేయాలన్నా..పనులు-ప్రాధాన్యతలు-అవసరాలను బట్టి చేపట్టాలన్నా వాటిపై ఉన్నతాధికారులకు సరైన అవగాహన ఉండాలి.16నెలల్లో నలుగురు కమిషనర్లు?ఇదీ మన జీహెచ్ఎంసీ పరిస్థితి అన్న టాక్ తెలంగాణ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. హైదరాబాద్ నగరాభివృద్ధికి జీహెచ్ఎంసీ అనేది గుండెకాయ లాంటిది. అలాంటి జీహెచ్ఎంసీలో పట్టుమని 16నెలలు కూడా కాలేదు. అప్పుడే నలుగురు కమిషనర్లు మారారు. దీంతో నగరాభివ్రుద్ది కొంత కుంటుపడుతోందన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. ఎందుకంటే జీహెచ్ఎంసీ 625 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన భారీ లోకల్ బాడీ. చావు పుట్టుకల లెక్కల నుండి మొదలుకొని వేలాది కోట్ల రూపాయల ప్రాజెక్టుల టేకప్ వరకు అనేక పనులు సిటిజన్స్ కు చేసి పెట్టాల్సిన సంస్థ.ఇలాంటి ముఖ్యమైన గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పోస్ట్ అంటే అంత ఆషామాషి కాదు. ఉదయం పారిశుద్ధ్యం నుండి మొదలుకొని రాత్రి స్ట్రీట్ లైట్స్ వరకు పనులన్నింటినీ చక్కబెట్టాలి. ఇలాంటి ముఖ్యమైన కార్పొరేషన్ లో అన్ని పనులను అధికారులతో సమన్వయంతో కలిసి ముందుకు తీసుకెళ్లాలి. ఒక్కమాటలో చెప్పాలంటే బల్దియా బాస్..ఆల్ ఇన్ వన్ అని చెప్పాలి. అయితే జీహెచ్ఎంసీకి వస్తున్న అధికారులు ముచ్చటగా మూడు-నాలుగు నెలలు కాకముందే సీటు మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.2023 సాధారణ ఎన్నికల కంటే కొద్ది నెలల ముందే జీహెచ్ఎంసీకమిషనర్ గా వచ్చిన రోనాల్డ్ రోస్ ను ఎన్నికలు పూర్తైన తర్వాత ఏడు నెలల్లోనే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. ఆ స్థానంలో అమ్రపాలి కాటానుగా నియమించింది. రెండు నెలలు ఇంచార్జిగా కొనసాగించి ఆ తర్వాత పూర్తిస్థాయిలో మరో రెండు నెలలు అవకాశం కల్పించింది.అమ్రపాలి కేవలం 4 నెలలు మాత్రమేజీహెచ్ఎంసీ కమిషనర్ గా పనిచేశారు. ఆ తర్వాత ఆమె ఏపీకి వెళ్లిపోవడంతో ఆమె స్థానంలో ఇలంబర్తిని గ్రేటర్ కమిషనర్ గా నియమించింది ప్రభుత్వం. జీహెచ్ఎంసీలో రిపోర్టు చేసే కంటే ముందే జార్ఖండ్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ కేటాయించడంతో ఝార్ఖండ్ నుండే నెల రోజులపాటు గ్రేటర్ పరిస్థితిని చక్కబెట్టారు జీహెచ్ఎంసీ కమిషనర్ గా ఉన్న ఇలంబర్తి. 2024 నవంబర్ 14 నుండి పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్న ఇలంబర్తి..కేవలం 5 నెలల్లోనే మళ్లీ ట్రాన్స్ ఫర్ అయ్యారు. ఇప్పుడు ఇలంబర్తి స్థానంలో ప్రభుత్వం ఆర్ వి కర్ణన్ నుజీహెచ్ఎంసీ నూతన బాస్ గా నియమించింది.జీహెచ్ఎంసీపై పట్టు సాధిస్తున్న తరుణంలో ఈ విధంగా 4నెలలోకోసారి కమిషనర్లను మార్చడంతో పాలన గాడి తప్పుతుందన్న వాదనలు గ్రేటర్లో వినిపిస్తున్నాయి. మొదట్లో రోనాల్డ్ రోస్ జిహెచ్ఎంసిపై పట్టు సాధించి అనేక పనులను వేగంగా కంప్లీట్ చేసే తరుణంలోనే ఆయన ట్రాన్స్ ఫర్ కాగా?తాజాగా ఇలంబర్తి కూడా బదిలీ కావడం చూస్తుంటే బల్దియా పాలన ఏడాది కాలంగా మూడు అడుగులు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైందిఇటీవల కాలంలో జిహెచ్ఎంసిలోని అనేక అక్రమాలపై ఫోకస్ చేశారు ఇలంబర్తి. ఉన్నతాధికారులందరూ పనుల్లో ఉండేటట్లు ఆయా విభాగాల్లో ఉన్న లోపాలను గుర్తించి వేగంగా సిటిజన్స్ కు సేవలు అందేలా ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్క విభాగంలోని లోపాలను గుర్తించి వాటిలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణలు కూడా చేయించారు.

# విశ్వంభర మరింత ఆలస్యం..



బింబిసార చిత్రంతో బడా హిట్ కొట్టిన దర్శకుడు వశిష్ట ప్రస్తుతం చిరంజీవితో విశ్వంభర అనే చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.. ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన విశ్వంభర చిత్రం పలు కారణాల వల్ల వాయిదా పడింది. విజువల్ ఎఫెక్ట్స్ ఇతర పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల వలనే బాగా ఆలస్యం అవుతున్నాయి అని తెలుస్తుంది. చాలా ఏళ్ల తర్వాత చిరంజీవి నటిస్తున్న ఫాంటసీ చిత్రం ఇదే కాగా, ఈ సినిమా వీక్షించేందుకు ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు . గతంలో చిరంజీవి ఇదే తరహాలో జగదేకవీరుడు అతిలోకసుందరి, అంజి చిత్రాల్లో నటించి మెప్పించిన విషయం తెలిసిందే. అయితే విశ్వంభర మూవీ రిలీజ్ విషయంపై అభిమానులలో గందరగోళం నెలకొంది. సంక్రాంతికి రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం మే నెలకు వాయిదా పడింది. మేలో రిలీజ్ కావడం లేదు జూలైలో రిలీజ్ అవుతుంది అంటూ ప్రచారం జరిగింది. దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక సమాచారం లేదు. లేటెస్ట్ గా వినిపిస్తున్న అప్డేట్ ఏంటంటే విశ్వంభర చిత్రం సెప్టెంబర్ 25న రిలీజ్ అవుతుందని తెలుస్తోంది. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు కాని ఓ వార్త మాత్రం నెట్టింట హల్‌చల్ చేస్తుంది. విశ్వంభర ఇలా వాయిదాలు పడుతండడంతో మూవీ విషయంలో ఏం జరుగుతుంది అంటూ అభిమానులు ముచ్చటించుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం విశ్వంభర గ్లింప్స్ రిలీజ్ చేయగా అందులో వీఎఫ్ఎక్స్ మీద విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో మూవీ యూనిట్ మరింత జాగ్రత్తపడి పోస్ట్ ప్రొడక్షన్ ని జాగ్రత్తగా చేస్తుంది.ఇక మూవీ యూనిట్ ఇప్పుడు మంచి ప్రయత్నం చేసింది. విశ్వంభర సినిమా 'రామ రామ' సాంగ్ ని పెన్‌డ్రైవ్స్ లో స్టోర్ చేసి తెలుగు రాష్ట్రాల్లోని శ్రీరామ, హనుమాన్ ఆలయాల్లో పూజారులకు కానుకగా ఇవ్వనున్నారు. ఆలయాల్లో రెగ్యులర్ గా ప్లే చేయడానికి, లేదా వాళ్ళ ఇళ్లల్లో అయినా ప్లే చేయడానికి ఈ పెన్ డ్రైవ్‌ని ఇస్తున్నారు.

ఇప్పటికే పెన్ డ్రైవ్‌ని కూడా రెడీ చేశారు. ఇక ఈ మూవీలో త్రిష

## షారుక్‌తో 6వ సారి జోడి కడుతున్న దీపికా పదుకొనే.!



బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొనే సినిమాలకు గ్యాప్ తీసుకున్న విషయం తెలిసిందే. జవాన్, కల్కి చిత్రాల తర్వాత మళ్లీ దీపికా ఏ సినిమాలోను నటించలేదు. గతేడాది తల్లిగా బాధ్యతలు తీసుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం అమ్మతనాన్ని ఎంజాయ్ చేస్తుంది. ఇదిలావుంటే దీపికా మళ్లీ సినిమాలకు ఒకే చెబుతున్నట్లు తెలుస్తుంది. తాజాగా ఆమె బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ నటిస్తున్న కింగ్ సినిమాలో హీరోయిన్‌గా నటించబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఐదు సార్లు షారుక్‌తో జోడి కట్టిన ఈ అమ్మడు తాజాగా మరోసారి సినిమా చేయబోతుంది. దీనికి సంబంధించి బాలీవుడ్ మీడియాలో ప్రస్తుతం వార్తలు వైరల్‌గా మారాయి. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో షారుఖ్ కూతురు సుహానా ఖాన్ కూడా ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. షారుఖ్ 'ఓం శాంతి ఓం' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన దీపికా పదుకొనే ఆ తర్వాత షారుఖ్‌తోనే కలిసి 'చెన్నై ఎక్స్‌ప్రెస్' 'హ్యాపీ న్యూ ఇయర్', 'పఠాన్', 'జవాన్' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించింది. 'కింగ్' వీరిద్దరి కలయికలో వస్తున్న 6వ చిత్రం. ఈ చిత్రంలో అభిషేక్ బచ్చన్ మరియు జైదీప్ అహ్లావత్ కూడా ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. 'కింగ్' సినిమా ముంబైలో మే 18 నుండి షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్, సచిన్-జిగర్ సంగీతం అందిస్తున్నారు.

## 'హిట్ 3' సినిమా టికెట్ ధరల పెంపు..

**- ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**

- నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్ 3'
- రేపు ప్రేక్షకుల ముందుకు వస్తున్న సినిమా
- మూవీ టికెట్ ధరల పెంపు.. ఏప్రీ ప్రభుత్వం ఉత్తర్వులు
- సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ. 50
- మల్టీప్లెక్సుల్లో రూ. 75 పెంచుకునేందుకు అనుమతి



నేచురల్ స్టార్ నాని, శ్రీనిధి శెట్టి జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'హిట్ 3'. హిట్ సిరీస్‌లో భాగంగా వస్తున్న మూడో చిత్రానికి శైలేష్ కొలను దర్శకత్వం వహించారు. ఈ సినిమా రేపు (మే 1న) ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే, ఈ మూవీకి ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. టికెట్ ధర పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ. 50 (జీఎస్‌టీతో కలిపి), మల్టీప్లెక్సుల్లో రూ. 75 (జీఎస్‌టీతో కలిపి) పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ పెరిగిన ధరలు వారం రోజుల పాటు అమలులో ఉంటాయని ఉత్తర్వులలో పేర్కొంది. ఇక, ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మిక్కి జే మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవలే సెన్సార్ పూర్తి చేసుకున్న హిట్ 3కు సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. 2.37 గంటల రన్‌టైమ్‌తో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## నేనలా మాట్లాడి ఉండాల్సింది కాదు



నటి ప్రీతి జింటా అభిమానికి క్షమాపణలు చెప్పారు. ఓ అభిమాని ప్రశ్నకు ఆమె స్పందించిన తీరు పలు విమర్శలకు దారి తీసింది. దాంతో ఆమె క్షమాపణ చెప్పక తప్పలేదు. వివరాల్లోకెళ్తే.. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ప్రీతి.. ఎక్స్ వేదికగా ఇటీవల అభిమానులతో ఇంటరాక్ట్ అయ్యారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ క్రమంలో ఓ అభిమాని.. 'హిందుత్వంపై మీ అభిమానం చూస్తుంటే మీరు భాజపాలో చేరతారేమో అనిపిస్తుంది? రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన ఉందా? అనడిగాడు. ఈ ప్రశ్న వినగానే ప్రీతి జింటా అసహనానికి లోనయ్యారు. కాస్త కఠినంగానే జవాబిచ్చారు. 'దేవాలయాలకూ, కుంభమేళాలకు వెళ్తే భాజాపాలో చేరినట్టేనా? అంటే నా సంస్కృతినీ నా ధర్మాన్ని గౌరవించడం కూడా నేరమేనా? ఈ సోషల్ మీడియాతో వచ్చే ఇబ్బంది ఇదే. ప్రతి ఒక్కరూ ఇక్కడ జడ్జ్ చేసేవారే.' అంటూ ఘాటు స్పందించారు ప్రీతి జింటా. అయితే.. నెట్టింట ఆమె ప్రవర్తించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. చిన్న ప్రశ్నకు ఇంత కఠినంగా జవాబివ్వాలా? అంటూ కొందరు ఎదురు ప్రశ్నించారు. దాంతో సదరు అభిమానికి ప్రీతి క్షమాపణలు చెప్పక తప్పలేదు. 'క్షమించండి.. నేనలా మాట్లాడి ఉండాల్సింది కాదు. ప్రస్తుతం విదేశాల్లో ఉంటున్నా. నా పిల్లలు భారతీయతనూ, మన సంప్రదాయాన్నీ, ధర్మాన్నీ మరచిపోకూడదనే తరచూ వాళ్లను దేవాలయాలకు తీసుకెళ్తుంటా. దురదృష్టవశత్తూ దాన్ని కూడా వేరేలా అర్థం చేసుకుంటున్నారు. రాజకీయం చేస్తున్నారు. అందుకే అలా మాట్లాడా.' అంటూ వివరణ ఇచ్చారు ప్రీతి జింటా.

## ప్రపంచంలో మా పరిస్థితి ఇదే

**- పాక్ నటి సభా కమర్ వ్యాఖ్యలు**



పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ప్రపంచ దేశాలు భారత్‌కు అండగా నిలుస్తున్నాయి. ఈ దాడిని ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా ఖండిస్తున్నారు. దీని ఫలితంగా పాకిస్థాన్‌పై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాక్‌పై కఠిన ఆంక్షలు విధిస్తోంది.

ఈ తరుణంలో పాక్ నటి సభా కమర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. గతంలో తనకెదురైన అవమానాలను గుర్తు చేసుకుని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తమ దేశస్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా అవమానాలు తప్పడం లేదని, అందరూ తమను వేరుగా చూస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఒకసారి షూటింగ్ నిమిత్తం తాను జార్జియాలోని టిబిలిసికి వెళ్లినప్పుడు, విమానాశ్రయంలో భారతీయులందరినీ పంపించారని, అయితే తన పాస్‌పోర్ట్ చూడగానే ఆపేశారని ఆమె గుర్తు చేసుకున్నారు. తాను పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తినని తెలియగానే అనేక ప్రశ్నలు అడిగిన తర్వాతే అనుమతించారని ఆమె తెలిపారు. ఆ సమయంలో తనకు ఎంతో అవమానంగా అనిపించిందని ఆమె అన్నారు.తమ దేశంలో పాకిస్థాన్ జిందాబాద్ అని నినదిస్తామని, కానీ ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తమ పరిస్థితి ఏమిటో తెలుస్తోందని ఆమె వాపోయారు. ఇలాంటి పరిస్థితులు రాకూడదని కోరుకుంటున్నానని ఆమె భావోద్వేగంతో అన్నారు. సభా కమర్ వ్యాఖ్యలపై భారతీయ నెటిజన్లు స్పందిస్తూ, ఇతర దేశాల వారిపై దాడులు చేస్తే ఇలాగే చూస్తారని కామెంట్లు పెడుతున్నారు.

## నటుడు అజిత్‌కు స్వల్ప గాయం.. ఆసుపత్రిలో చికిత్స



ప్రముఖ తమిళ నటుడు అజిత్ కుమార్ స్వల్ప గాయంతో చెన్నైలోని ఒక ఆసుపత్రిలో చేరారు. మంగళవారం రాత్రి చెన్నై విమానాశ్రయంలో అభిమానుల అత్యుత్సాహం కారణంగా జరిగిన తోపులాటలో ఆయన కాలికి గాయమైంది.

అయితే, ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని అజిత్ బృందం స్పష్టం చేసింది. పద్మభూషణ్ పురస్కార స్వీకరణ కార్యక్రమం అనంతరం అజిత్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి ఢిల్లీ నుంచి చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. తమ అభిమాన నటుడిని చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు విమానాశ్రయానికి తరలివచ్చారు. అజిత్‌ను చూసేందుకు అభిమానులు ఒక్కసారిగా ముందుకు దూసుకురావడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు, తోపులాట చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలోనే అజిత్ కాలికి స్వల్ప గాయమైనట్లు ఆయన ప్రతినిధులు తెలిపారు. వెంటనే అజిత్‌ను చికిత్స నిమిత్తం చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వైద్యులు ఆయనను పరీక్షించి, కాలికి అయిన గాయం స్వల్పమైనదేనని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని ధృవీకరించినట్లు అజిత్ బృందం జాతీయ మీడియాకు వెల్లడించింది. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నారని, ఈ రోజు సాయంత్రానికి నాటికి ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. అజిత్ ఆరోగ్యం గురించి

## అన్ని రంగాల కార్మికులకు మేడే శుభాకాంక్షలు

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి : కడారి రాములు**



**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని రంగాల కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి,సీపీఐ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి కడారి రాములు మే డే శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించాలని కోరారు. హమాలీలు తక్కువ వేతనాలతో పాటు, సురక్షిత ఉద్యోగ వాతావరణం లేకపోవడం, భద్రతా లోపాల వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వీటికి చట్టబద్ధ పరిష్కారాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల ఐక్యతే సమాజ అభివృద్ధికి బలం అని అన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిత్యానంద రావు కుమారుడి వివాహ వేడుకలకు బుధవారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం: ఎమ్మెల్యే శ్రీ గణేష్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న 6వ వార్డులో సిఖ్ రోడ్,జూపిటర్ కాలనీలో 35 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించినున్న అండర్ గ్రౌడ్ సివరేజ్ పైప్‌లైన్ ను కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ గణేష్ తో పాటు బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లిఖార్జున్ కలసి ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.బోర్డు పరిధిలో ఉన్న ప్రజలకు సరిపడా నీటి సరఫరా జరగడం లేదని,వీలైనంత త్వరగా ఎనిమిది వార్డుల్లో ఉన్న పంపు హౌస్ లో ఓవరెట్ ట్యాంక్ లను నిర్మిస్తున్నట్లు తద్వారా నీటి కష్టాలు గట్టెక్కుతాయన్నారు.అలాగే కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యమని,అందుకే ఒక్కో వార్డులోని సమస్యలను తీరుస్తూముందుకు వేళుతున్నామని ఎమ్మెల్యే అన్నారు.కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సమస్యలే లేని నియోకవర్గంగా రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే శ్రీ గణేష్ స్పష్టం చేశారు.అలాగే స్థానికులు కాలనీ సమస్యలను తీర్చినందుకు ఎమ్మెల్యే శ్రీగణేష్ కు ధన్యవాలు తెలియచేశారు.బోర్డు సివిల్ మెంబర్ భానుక నర్మదా మాట్లాడుతూ పదిహేడు కోట్ల నిధులతో బోర్డు పరిధిలో అభివృద్ధి చేస్తున్నట్లు, బస్తీలు, కాలనీలు "ఓపెన్ జిమ్స్"కావాలని కోరుతున్నట్లు సభలో వెల్లడించారు.అలాగే ఎనిమిది వార్డుల్లో మౌళిక సదుపాయాల కల్పనలో ఫోకస్ చేస్తూ దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు నర్మదా తెలిపారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు శరత్ కుమార్,సదా, టిఎమ్మార్పిఎస్ మీడియా కో-కోర్డినేటర్ ఇటుక గోపితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు స్థానికులు పాల్గొన్నారు. ?

## విధులు సక్రమంగా నిర్వహించడంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అభినందనీయం

- శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి
- జిల్లా ఎస్పీ : మహేష్ బి. గితే - ఉద్యోగ విరమణ పొందిన ఏ.ఎస్సై మీర్జా యాహియా బేగ్
- జిల్లా ఎస్పీ సన్మానం...! జ్ఞాపిక అందజేత...!!



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** పోలీస్ శాఖలోలో 42 సంవత్సరాలు కానిస్టేబుల్ నుండి ఏ. ఎస్.ఐ గా ప్రస్తుతం చందుర్తి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న ఏ.ఎస్సై మీర్జా యాహియా బేగ్ కు జిల్లా పోలీస్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించి జ్ఞాపిక అందజేసి, శుభాకాంక్షలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖలో మీరు అందించిన సేవలు మిగతా వారికి స్ఫూర్తిదాయకం అని,ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని,వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలియజేశారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి తెలియజేశారు. ఉద్యోగ విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని సూచించారు. తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు.ఎటువంటి అవసరం ఉన్నా పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సి.ఐ వెంకటేశ్వర్లు, ఎస్.ఐ అంజయ్య,ఏ.ఎస్సై మీర్జా యాహియా బేగ్ కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులు,తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# సారథితో సమస్య పరిష్కారం: జిల్లా మంత్రి పొన్నం





**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో రవాణా శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్న ప్రభుత్వం.ఇక రాష్ట్రంలో రవాణా శాఖ కార్యాలయాల్లో రద్దీ లేకుండా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా "ఆన్ లైన్ లో"సారథి పోర్టల్ "ని ప్రారంభించారు రవాణా , బిసి సంక్షేమశాఖ, హైదరాబాద్ జిల్లా మంత్రి పోన్నం ప్రభాకర్.దతిరుమలగిరి ఆర్టీవో కార్యాలయంలో "సారథి పోర్టల్ ను" ఆధునీకరించి తిరుమలగిరి ఆర్టీవో కార్యాలయంలో ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్.అలాగేబిఅగ్నివీర్ లకు లైసెన్స్ లతో పాటు హెల్మెట్ లు అందించిన మంత్రి పొన్నం ప్రభాకర్.

### మంత్రి పొన్నం ప్రభాకర్ కామెంట్స్..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున రవాణా శాఖను కేంద్రం,రాష్ట్రం కలిసి నడుపుతాయి.దేశంలో పరివాహన్ సారథి అనే పోర్టల్ ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.దేశంలో ఇప్పటికే 28 రాష్ట్రాలు సారథిను అమలు చేస్తున్నాయి.కానీ మనరాష్ట్రంలో సారథి పోర్టల్ ను ఎప్పుడో అమలు చేయాల్సింది, కానీ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యం జరిగింది.ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తరువాత సారథి పోర్టల్ పై నిర్ణయం తీసుకొని ప్రారంభించుకోవడం జరిగిందని ఆయన సందర్భంగా గుర్తు చేశారు. భారతదేశ రవాణా చట్టానికి సంబంధించిన సమాచారం లోపల మనం కూడా అంతర్భాగం అయ్యాయని, దేశ వ్యాప్తంగా రవాణా పరమైన మార్పులు నిర్ణయాలు వాహనాల సమాచారం,రవాణాశాఖకు సంబంధించిన మొత్తం సమాచారం మన దగ్గర తెలుసుకునే వెసులుబాటు కల్పించామని మంత్రి పేర్కొన్నారు.గతంలో తెలంగాణాకి వాహన సారథి సభ్యులుగా చేరడం వల్ల రవాణా అంశాల్లో దేశంలో భాగస్వామ్యులం అయ్యాం. ప్రతి రోజు కనీసం 20 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వందలాది మంది వైకల్యం పొందుతున్నారు.

ఎదుటివారి నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు అమాయక ప్రాణాలు.రోడ్డు మాసోత్సవాలు ద్వారా రోడ్డు భద్రత కార్యక్రమాలు చేపట్టారు.రోడ్డు భద్రత పై అవగాహన కల్పించి ప్రాణాలు కాపాడేలా స్కూల్ స్థాయి నుండి కార్యక్రమాలు చేపడితేకొంత మేరకు ప్రమాదాలు అరికట్టోచ్చు.రవాణా శాఖ రూల్స్ పట్ల అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపడుతున్నారు.పిల్లల్లో ఇప్పటి నుండే అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఎంతైనా ఉందని మంత్రి పోన్నం ప్రభాకర్ తెలిపారు. రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ల పార్కులు ఏర్పాటు చేస్తున్నాం.ప్రతి పాఠశాలలో స్కూల్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.మారుతున్న సాంకేతిక విప్లవంలో రోడ్ నిబంధనలు పాటించకపోతే లైసెన్స్ లు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటాము. మరో విషయం ఏమిటంటే హైదరాబాద్ మరో ఢిల్లి కావద్దని అక్కడ కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని దేశంలోనే మొదటి "ఈవీ పాలసీ" తీసుకొచ్చినట్టు గుర్తు చేశారు."ఈవీ" వాహనాలకు జీరో టాక్స్ చేశాం.వందల కోట్లు నష్టం వచ్చిన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ఇబ్బంది కలగద్దని ఈవీ పాలసీ తీసుకొచ్చాం.15 సంవత్సరాలు దాటిన వాహనాల పై స్కాప్ పాలసీ తీసుకొచ్చాం.ప్రజల సహకారం లేకపోతే ఏది సాధ్యం కాదన్నారు.రవాణా నిబంధనలు పాటిస్తూ మనం సురక్షితంగా ఇంటికి వెళ్లేలా రవాణా నిబంధనలు పాటించండి అంటూ వాహనదారులకు తెలియజేశారు.రవాణా శాఖ సేవలు ఆన్లైన్ అందించడం ద్వారా మధ్యవర్తి లేకుండ పారదర్శకంగా అందిస్తుంది.

రవాణా శాఖ ఆర్టీసీలో ఉచితంగా బస్సు సౌకర్యం అందిస్తున్నా విషయాన్ని గుర్తు చేశారు.రోడ్డు ప్రమాదాల రహిత తెలంగాణగా మారుస్తామని మంత్రి మరోసారి సభలో వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్,రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి,కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్, బోర్డు సివిల్ మెంబర్ భానుక నర్మదా, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,తిరుమల గిరి ఆర్టివో ఎర్ర స్వామి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో వేములవాడ విద్యార్థుల ప్రభంజనం

**- ఉత్తమ మార్కులతో పలు ప్రైవేట్ స్కూళ్లలో రికార్డు ఫలితాలు నమోదు**





**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు బుధవారం విడుదలైన తెలంగాణ పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

### ఉజ్వల హై స్కూల్

ఈ పాఠశాల విద్యార్థులు గణనీయమైన ప్రదర్శన కనబరిచారు. జె. హర్షిత్ 550, ఎస్కే. తయ్యబ్ ఫాతిమా 535, సయ్యద్ ఆయేషా 482, ఎ. లహరి 478, జి. అశోక్ 458, బి. శివ సాయి 442, ఎ. నాగరాణి 405 మార్కులు సాధించారు. వి. ప్రతిమ 445 మార్కులతో మంచి ఫలితాన్ని నమోదు చేసింది.

### గౌతమ్ మోడల్ స్కూల్

పాఠశాల స్థాపన తర్వాతి కాలంలోనే అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ గౌతమ్ మోడల్ స్కూల్ మరోసారి తన ప్రాధాన్యతను నిరూపించుకుంది. 100% ఉత్తీర్ణత సాధించడంతోపాటు, 17 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు.

ఈ పాఠశాలకు చెందిన పొన్నం రష్మిని 600కు గాను 586 మార్కులతో పట్టణంలో టాపర్‌గా నిలిచింది. ఆమెకు గుర్తింపుగా పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమారమేష్ రూ.40 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు.



ఫలితాల సందర్భంగా పాఠశాల నిర్వహకులు బాణాసంచాలు కాల్చి సీట్లు పంపిణీ చేస్తూ విజయోత్సవాలు నిర్వహించారు.

### కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్

ఈ పాఠశాల విద్యార్థులు కూడా మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జి. మాధురి 539, బి. స్మితిల 536, జి. మోక్షిత్ 525, మనహాళ్ 523, ఎల్. అరవింద్ 517, వై. అనుశ్రీ 506, కే. అలేఖ్య 500 మార్కులు సాధించారు.

### వివేకానంద హై స్కూల్

వర్షిత్ 551, ఋషిక 547, శివాని 545, దీక్షిక 542, స్వాతి 541, సర్వరి 541, హరిణి 541 మార్కులతో ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ విద్యార్థులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యలోనూ రాణించి దేశాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# యస్. యస్.సి. ఫలితాల్లో విజయకేతనం ఎగరవేసిన రామాంతపూర్ శ్రీ చైతన్య విద్యార్థులు

**- విద్యార్థిని విద్యార్థులను అభినందించిన జోన్ ఏ.జి.యం. నూర్ మహమ్మద్ అలి**




**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ యస్.యస్.సి ఫలితాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫలితాలను విడుదల చేశారు.బుధవారం విడుదలైన ఫలితాల్లో రామంతపూర్ శ్రీ చైతన్య విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు.పాఠశాల విద్యార్థిని షేక్ జుబియా 586/600, నేలపాటి ధాత్రి 581/600 గాను మరియు 570 పైగా 9 మంది విద్యార్థులతో పాటు 550 పైగా 25 మంది విద్యార్థులు,500 మార్కులకు పైగా 72 నుంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి విజయకేతనం ఎగరవేశారని నారాయణగూడ జోన్ ఏ.జి.యం.నూర్ మహమ్మద్ అలి విద్యార్దులను అభినందించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చైతన్య పాఠశాల చక్కని కరికులంతో,అకుంఠిత దీక్షతో, అవిశ్రామంతో విద్యార్థులను తీర్చిదిద్దామని తెలిపారు.ప్రతి ప్రతి ఏటా లాగానే ఈ ఏడాది విజయ దుందుభిని మోగించిందన్నారు.ఉత్తమ ఫలితాలు రావడానికి కారణమైన అధ్యాపకులను ఈ సందర్భంగా అభినందించి ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ టీమ్ డీన్ పుల్లారావు,జోన్ కో-ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్,డీన్ నాగరాజు, ఇన్చార్జులు కనకయ్య,అరుణ్ కుమార్ , వైస్ ప్రిన్సిపల్ శ్రీ కీర్తి,పదవ తరగతి ఇంచార్జి అయిలయ్య, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాణం కంటే ఎక్కువ ఏది కాదు

**- ఫెయిల్ అయితే పోయేదేమీ లేదు**
**- వాయిదా పద్ధతుంది దేనికైనా**
**- క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు వద్దు**

**"పరీక్షలంటే బయపడే వారికి 1989వ సంవత్సరంలోనే సినీ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి మంచి మాటలే చెప్పారు.. ఆయన రాసిన ఓ పాటలో.. ఎందుకీ హైరానా వెర్రినాన్నా.. వెళ్లరా సులువైన దారిలోనా ఉందిగా సెప్టెంబరు మార్చిపైనా హెరీయ్.. వాయిదాపద్ధతుంది దేనికైనా.. అంటూ కుర్రకారులో హుషారు నింపారు. పరీక్షలంటే భయపడే వారికి, పరీక్ష ఫలితాలు చూసి ఇంటి నుంచి బయటికి రాని వారికి, ఆత్మన్యూనతతో అఘాయిత్యాలకు పాల్పడే వారికి.. అప్పటికీ.. ఎప్పటికీ వచ్చే తరాల వారికి కూడా సిరివెన్నెలవారి పదాల మాత్రలు అమోఘంగా పనిచేస్తాయి. ఒక్కసారి ఆ చరణాలు వింటే ఎక్కడ లేని ఆత్మవిశ్వాసం కట్టలుతన్నుకుని మరీ వస్తుంది"**

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** పరీక్షల్లో ఫెయిలయితే విద్యార్థులు బాధపడటం సహజం. అయితే దాంతోనే కుంగిపోనక్కర లేదు. మరోసారి రాసి పాస్ కావచ్చు. విలువైన కాలం వృథా అవుతోందని బాధపడనవసరం లేదు. ఎందుకంటే ఈ వ్యవధిలో ఎన్నో విలువైనవి నేర్చుకోవచ్చు. చేరాల్సిన కోర్సులపై సందిగ్ధత వదిలి స్పష్టత ఏర్పరచుకోవచ్చు. అనుకోకుండా వచ్చిన ఈ విరామం వరం లాంటిదని గ్రహించాలి. అందుకే మంచి మార్కులతో పాసైన వారిలో కూడా కొందరు పై చదువులకు వెళ్లకుండా ఏడాది వరకు గ్యాప్ తీసుకుంటున్నారు. విద్యాసంవత్సరం నుంచి కావాలని వెసులుబాటు కల్పించుకునే విధానం ప్రపంచంలోని చాలా దేశాల్లో అమలులో ఉంది. గ్యాప్ ఇయర్ అని, సబాటికల్ ఇయర్ అనీ వ్యవహరించే ఈ విధానం మన దేశంలోనూ ప్రాచుర్యం పొందుతోంది. ప్రవేశాలు, పాఠాలు, పరీక్ష నిర్విరామ చక్రభ్రమణానికి ఇలా పాజ్ బటన్ నొక్కడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఫెయిలతే.. పోయేదేమీలేదు.. మరింత మెరుగ్గా పరీక్షను ఎదుర్కొనే శక్తి లభిస్తుంది.

### పోలికలతోనే మనసుపై గాయం...:

సాధారణంగా తల్లిదండ్రులు కొందరు తమ పిల్లలను ఇతరులతో పోల్చుతుంటారు. తమ పిల్లల్లో ఎన్ని సుగుణాలు ఉన్నా పొరుగున ఉన్న వారే ఉత్తములుగా కీర్తిస్తుంటారు. దీనితో చిన్నారుల మనసు గాయపడుతుంది. ప్రధానంగా టీనేజ్లో ఉండే వారిలో ఇది అధికంగా ఉంటుంది. హైస్కూల్ నుంచి కళాశాల స్థాయిలో ఉండే ఈ రకం పిల్లలను ఇతరులతో ఎప్పుడూ పోల్చవద్దు. తమ పిల్లల ఇష్టా ఇష్టాలను తెలుసుకుని ఆయా రంగాల్లో వారిని ప్రోత్సహించాలి. అంతేకాని తల్లిదండ్రులు తాము చదవలేకపోయిన, తమ మిగిలిన తాము కాలేకపోయిన ఆశయాలను పిల్లలపై రుద్దడం సరికాదు. దానివల్ల పిల్లలు తల్లిదండ్రులను ఒత్తిడి కల్పించే వస్తువుగా చూసే ప్రమాదం ఉంది.

### పిల్లలూ లైట్ తీసుకోండి..

ఇంటర్ ఫలితాలు వచ్చాయి.. నిన్న పదవ తరగతి పరీక్ష



ఫలితాలు కూడా వచ్చాయి. తక్కువ మార్కులు వచ్చాయనో.. తాము ఫెయిల్ అయ్యామనో పిల్లలు బాధపడనవసరం లేదు. ఎందుకంటే పాస్ అయిన వారు ముందుకు వెళ్లి చేసేదేమీ లేదు. విద్యాసంవత్సరం నష్టపోయిందనే ఆందోళన అవసరం లేదు. కాబట్టి మార్కులు తక్కువ వచ్చినా.. ఫెయిల్ అయినా లైట్ తీసుకుని, వచ్చే కాలానికి అనుగుణంగా ప్రణాళిక రచించుకోవడం ఉత్తమం.

### ఫెయిలయితే ప్రాణాల మీదికి వద్దు..

సాధారణంగా 20 ఏళ్లలోపు ఉన్న పిల్లలు సున్నిత మనస్కులుగా ఉంటారు. పొగిడితే వారు ఎగిరి గంతేస్తారు. అదే సమయంలో ఎవరైనా చిన్నతనం చేస్తే నొచ్చుకుంటారు. పదవ తరగతి, ఇంటర్ చదివే పిల్లలపై వారి తల్లిదండ్రులు ఇటీవల బైకిబై మార్కుల ఒత్తిడి తెస్తున్నారు. పదిలో అయితే 550 మార్కుల పైకి, ఇంటర్లో అయితే 950 మార్కులకు అధికంగా రావాలని కోరుకుంటుంటారు. అయితే ఈ కోరికను పిల్లలపై రుద్ది వారిపై అధిక ఆశలు పెట్టుకుంటుంటారు. పరీక్షలలో పాసైన వారికి, స్టేట్ ఫస్ట్ వచ్చిన వారికి పెద్ద తేడా ఏమీ ఉండదనే విషయాన్ని పేరెంట్స్ మర్చిపోతున్నారు. దీంతో పరీక్ష ఫలితాలు వచ్చిన రోజున వారిని ఎడాపెడా మనసు గాయపడే మాటలు అనడంతో వారు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

### బొమ్మరిల్లు తండ్రిగా వద్దు..

ఎదిగే పిల్లలతో తల్లిదండ్రులు స్నేహితుల్లా మెలగాలి. వారితో అన్ని విషయాలు షేర్ చేసుకోవాలి. అంతేకాని బొమ్మరిల్లు సినిమాలో ప్రకాష్ రాజ్ మాదిరిగా ప్రవర్తించవద్దు. ఒక్కో వ్యక్తికి ఒక్కో అంశంపై ఆసక్తి ఉంటుంది. ఆయా మార్గాల్లో పయనిస్తేనే వారు విజయం సాధించే అవకాశం ఉంటుంది. అంతేకాని వారికి ఇష్టంలేని రంగంలోకి పంపి అధిక ఒత్తడికి గురి చేయడం మంచిది కాదు.

## శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్గా.. భోర్ఖడే హేమంత్ సహేదేయోరావ్



**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్గా భోర్ఖడే హేమంత్ సహేదేయోరావ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ జోనల్ కమిషనర్గా పనిచేసిన పి.ఉపేందర్రెడ్డి హెచ్ ఎండీఏ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవెలప్మెంట్ అథారిటీ) సెక్రటరీగా బదిలిపై వెళ్లడంతో నూతనంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్గా భోర?డే హేమంత్ సహేదేయోరావ్ విధుల్లో చేరారు. ఈయన గతంలో టీజీఎంఎస్ఐడీసీ (తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్లో పనిచేశారు. ఈ సందర్భంగా జడ్సీ మాఆట్లాడుతూ.. శేరిలింగంపల్లి జోనల్ పరిధిలో అంకిత భావంతో పని చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## పహల్గామ్ దాడిపై వివిధ దేశాలకు జైశంకర్ ఫోన్ కాల్స్

**- బాధ్యులపై చర్యలకు భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటన**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్లోని పహల్గామ్లో జరిగిన ఉగ్రదాడి ఘటనపై భారత్ తన దౌత్యపరమైన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ దాడి వెనుక ఉన్న సరిహద్దు ఉగ్రవాద కోణాన్ని, వాస్తవాలను అంతర్జాతీయ సమాజానికి వివరించే ప్రక్రియను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ బుధవారం కీలక దేశాలైన డెన్మార్క్, కువైట్ల విదేశాంగ మంత్రులతో టెలిఫోన్లో సంభాషించారు. డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లొక్కె రాస్ముస్సెన్, కువైట్ విదేశాంగ మంత్రి అబ్దుల్లా అలీ అల్-యహ్యాలతో జైశంకర్ వేర్వేరుగా మాట్లాడారు. పహల్గామ్ దాడి తర్వాత ఆయా దేశాలు అందించిన మద్దతు, సంఘీభావానికి ఆయన కృతజ్ఞతలు తెలిపినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా, దాడికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలన్న భారత ప్రభుత్వ దృఢ నిశ్చయాన్ని ఆయన మరోసారి స్పష్టం చేశారు. ఈ సంభాషణలకు ముందు, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోని ఏడు తాత్కాలిక సభ్య దేశాల విదేశాంగ మంత్రులతో కూడా జైశంకర్ చర్చలు జరిపారు. పహల్గామ్ దాడి వివరాలను, దాని వెనుక ఉన్న శక్తుల గురించి వారికి వివరించారు. కాగా, 2025-26 సంవత్సరానికి పాకిస్థాన్ కూడా భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా ఎన్నికైన నేపథ్యంలో, భారత్ చేపడుతున్న ఈ దౌత్యపరమైన చర్చలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. భారత్ తన వాదనలను, ఆధారాలను అంతర్జాతీయ వేదికలపై ఉంచుతూ, ఉగ్రవాదంపై పోరులో ప్రపంచ దేశాల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తోంది.

# ఫ్రీ హ్యాండ్ ఇచ్చినట్లేనా.?

**- జగన్ లో వచ్చిన మార్పునకు కారణం.?**
**- ఎందుకు అలాంటి డెసిషన్ తీసుకున్నారు?**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ అధినేత జగన్ ఒక్క ఛాన్స్ నినాదంతో అధికారంలోకి వచ్చారు. అయితే అధికారంలోకి రాకముందు అంటే వైసీపీ పార్టీ పెట్టిన నాటినుంచి నేతలకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వలేదు. ఏదైనా చేయాలంటే పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. కేంద్ర పార్టీ కార్యాలయం పిలుపు ఇచ్చినప్పుడు మాత్రమే స్పందించాలి. అదే విధంగా పార్టీ కేంద్ర నాయకత్వం రూపొందించిన కార్యక్రమాలను అమలు చేయడమే జిల్లా, నియోజకవర్గాల స్థాయి నేతల పని. అంతే తప్పించి వారంతట వారుగా ఏ నిర్ణయం తీసుకునే అవకాశం ఇవ్వలేదు. కారణం జిల్లాలో నేతలు తమకు ఇష్టమొచ్చినట్లు కార్యక్రమాలను నిర్వహిస్తే రాజకీయపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని అనుకుని ఈ రకమైన ఆదేశాలు జారీ చేశారు.

### - మొన్నటి వరకూ...

ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అంతే. పార్టీ కేంద్ర నాయకత్వం ఆదేశాల మేరకు మాత్రమే మీడియా సమావేశాలు కూడా పెట్టాలి. నాటి ప్రతిపక్షంపై విమర్శలు చేయాలన్నా ఎంపిక చేసిన నేతలకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఎవరంటే వారు స్పందించడం అనేది వైసీపీలో అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు సాగలేదు. బహుశ ప్రాంతీయ పార్టీల్లో ఎందులోనైనా రాష్ట్రం ఏదైనా ఇదే విధానాన్ని పార్టీ అధినేతలు అమలు పరుస్తుంటారు. వైసీపీలో కూడా అదే తీరు ఇప్పటి వరకూ నడిచింది. అయితే గత ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత జగన్ లో మార్పు కనిపిస్తుంది. తరచూ నేతలతో ఆయన సమావేశమవుతున్నారు. భవిష్యత్ మనదేనని భరోసా ఇస్తున్నారు.

### - జిల్లా అధ్యక్షులతో జరిగిన సమావేశంలో..

తాజాగా జిల్లాల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో నేతలకు జగన్ ఫ్రీ హ్యాండ్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పడంతో పాటు స్థానిక సమస్యలపై జిల్లా అధ్యక్షులు నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ వారికి అండగా నిలబడే ప్రయత్నిం చేయాలని, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసిన ఈ ప్రభుత్వాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు ప్రయత్నించాలని జగన్ అన్నారు. ప్రజల్లో తిరుగుతున్న తీరు, నియోజకవర్గాల ఇన్ ఛార్జులతో సమన్వయం చేసుకుని ఎక్కడికక్కడ కార్యక్రమాలను రూపొందించుకోవలాని కూడా జగన్ తెలిపారు.

### - పార్టీ ఓనర్ షిప్ మీదేనంటూ..

అంతే కాదు జగన్ మరో ముఖ్యమైన పదాన్ని సమావేశంలో వాడటం అందరినీ ఆశ్చర్యపర్చింది. మీ జిల్లాలో పార్టీ ఓనర్ షిప్ మీదేనని వారికి చెప్పారు. పార్టీ అధ్యక్షులదే కీలక బాధ్యత అని తెలిపారు. ఎవరి నుంచో ఆదేశాలు వస్తాయని ఎదురు చూడవద్దని, వెంటనే నిర్ణయాలు తీసుకుని ప్రజాక్షేత్రంలో పోరాటం చేయాలని జగన్ అనడం నిజంగా జల్లా నేతలకు, నియోజకవర్గాలకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చినట్లేనా? అన్న సందేహం కలుగుతుంది. నియోజకవర్గ ఇన్ ఛార్జిని స్వయంగా కలుసుకుని వారితో ఎప్పటికప్పుడు మాట్లాడాలని తెలిపారు. అలాగే మే నెలాఖరులోపు పార్టీ మండల కమిటీలను, జూన్, జులై నెలల్లోగా గ్రామ, మున్సిపాలిటీల్లోని డివిజన్ కమిటీలను పూర్తి చేయాలని, ఆగస్టు, సెప్టంబరు, అక్టోబరు నాటికి బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని కూడా తెలిపారు. మొత్తం మీద జగన్ నేతలకు ఫ్రీహ్యాండ్ ఇచ్చినట్లేనని అర్ధమవుతున్నా ఏ మేరకు నేతలు చొరవ తీసుకుంటారన్నది చూడాలి.

## రాజీవ్ యువ వికాసం పథకంపై బిగ్ అప్డేట్

**- వారికి మరో ఛాన్స్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పథకం రాజీవ్ యువ వికాసం పథకం. ఈ పథకం ద్వారా యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం కింద ఆన్లైన్లో పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తు ప్రక్రియలో భాగంగా ఆన్లైన్లో నమోదు చేసుకున్న కొందరు అభ్యర్థులు తమ దరఖాస్తుల హార్డ్ కాపీలను సంబంధిత మండల కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంది.కొన్ని అనివార్య కారణాల వల్ల, సరైన సమాచారం లేకపోవడం వల్ల చాలా మంది అభ్యర్థులు ఇంకా తమ దరఖాస్తుల యొక్క హార్డ్ కాపీలను మండల కార్యాలయాలకు పంపలేదు. అటువంటి అభ్యర్థులు తమ ఆన్లైన్ దరఖాస్తు ప్రింటెడ్ కాపీని అవసరమైన సంబంధిత జిరాక్స్ కాపీలను తమ తమ మండలాల కార్యాలయాల్లో నేరుగా మే 2, 2025 సాయంత్రం 5 గంటల వరకు సమర్పించవచ్చు. కాబట్టి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.రాజీవ్ యువ వికాసం పథకానికి వచ్చిన దరఖాస్తుల సంఖ్య భారీగా ఉంది. కేటగిరీల వారీగా దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. మొత్తంగా రాజీవ్ యువ వికాసం పథకానికి 5,30,000 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సంఖ్య యువతలో ఈ పథకం ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ప్రభుత్వం ఇప్పుడు ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. హార్డ్ కాపీలు అందిన తర్వాత ఈ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుంది.రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా వివిధ వర్గాల యువతకు వారి స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయితే, ప్రారంభ దశలో ప్రభుత్వం కేటగిరీ-1 మరియు కేటగిరీ-2 కింద రుణాల మంజూరుకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. ఈ రెండు కేటగిరీలలో ప్రభుత్వం ఆశించిన దానికంటే తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఈ వర్గాల కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులందరికీ నూరు శాతం ప్రయోజనం చేకూరనుంది. అంటే, ఈ రెండు కేటగిరీల్లో అర్హత సాధించిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తప్పకుండా రుణ సహాయం అందిస్తుంది. మిగిలిన కేటగిరీల దరఖాస్తులను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. త్వరలోనే వాటికి సంబంధించిన వివరాలను కూడా వెల్లడిస్తుంది. అయితే, ప్రారంభంలో తక్కువ దరఖాస్తులు వచ్చిన ఈ రెండు కేటగిరీల వారికి వెంటనే లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# భారత్ దాడులు చేస్తే మేం ప్రతిదాడి చేస్తాం

**- పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి**



**ఇస్లామాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, పరిస్థితులు మరింత తీవ్రంగా మారుతున్నాయని పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యానించారు. ఒకవేళ భారత్ దాడులకు పాల్పడితే, తాము ప్రతిదాడి చేస్తామని స్పష్టం చేశారు. ఇటీవలి పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించిన నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పాకిస్థాన్ పార్లమెంటు వెలుపల మాధ్యమాల ప్రతినిధులతో మాట్లాడుతూ ఖవాజా ఆసిఫ్ ప్రస్తుత పరిస్థితులపై స్పందించారు. "పహల్గాం దాడి అనంతరం ఇరు దేశాల మధ్య ప్రతిరోజూ ఉద్రిక్తత పెరుగుతూనే ఉంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అత్యంత తీవ్రంగా ఉన్నాయి" అని దేశ భద్రతాపరమైన చర్యలపై అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. పలు దేశాలు శాంతి స్థాపనకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. "ఒకవేళ భారత్ మాపై దాడులకు పాల్పడితే, మేం తప్పకుండా ప్రతిదాడి చేస్తాం. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు. అది పూర్తిగా భారత్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది" అని ఆసిఫ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో భారత్ తీవ్రమైన చర్యలు తీసుకుంటోందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పడానికి భారత్ అంగీకరించే సూచనలు కనిపించడం లేదని ఆయన అన్నారు. "భారత వైఖరి పట్ల పాకిస్థాన్ కూడా అంతే గట్టిగా, ఊహించని విధంగా స్పందిస్తుంది. ఇరు దేశాల మధ్య సయోధ్య కుదరాలని ఆ దేవుడినే ప్రార్థిస్తున్నాను" అని ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588